
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
3
బుధవారం 3 డిసెంబరు 2025



# చూడముచ్చటగా...



యల్లమరాజు చెరువులో నీటిని తాకుతున్నట్లున్న మేఘాలు


- యల్లమరాజు చెరువులో జలకళ

చిట్వేలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చుట్టూ కొండలు.. ప్రకృతి రమణీయంగా ఉన్న వాతావరణం అలుగు నుంచి నీరు జాలువారుతూ చూపరులకు కనువిందు చేస్తోంది. చిట్వేలిలోని యల్లమరాజు చెరువుకు వర్షపునీరు వచ్చి చేరడంతో తూర్పు, పడమరవైపు ఉన్న అలుగులు పొంగి పొర్లుతున్నాయి. చెరువులో నీరు ఆకాశం రెండూ ఒక్కటయ్యేలా కనిపిస్తున్న చిత్రం ఔరా అనిపిస్తోంది.



చూపరులను ఆకట్టుకున్న చెరువు అలుగు

# కొండకోనల్లో జలసవ్వడి



కర్కటేశ్వరస్వామి ఆలయం వద్ద జలపాతం

రైల్వేకోడూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి నదులకు భారీగా వరద నీరు చేరింది. కొండ కోనల్లో జలసవ్వడి నెలకొంది. శేషాచలం, వెలుగొండ, పాలకొండలు, పెనుశిల అడవుల్లో వరద నీరు ప్రవహిస్తోంది. మంగళవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. గుండాలకోనలోని కర్కటేశ్వర స్వామి ఆలయం వద్ద జలపాతం కనువిందు చేస్తోంది. రెడ్డివారిపల్లె తాత్కాలిక రోడ్డు తెగిపోవడంతో రెండోరోజు కూడా రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా గంగురాజుపోడు-పొట్టిరాజుగారిపల్లె తాత్కాలిక రోడ్డు కూడా తెగిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. రైల్వేకోడూరు నుంచి బాలిరెడ్డిపల్లె మీదుగా వై.కోటకు వెళ్లే రోడ్డులో గుండాలకోన (గుండాలేరు) ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలలో నివశిస్తున్న ప్రజల్ని అధికారులు అప్రమత్తం చేశారు. గుంజన, ముష్టేరు తదితర నదులకు భారీ గా వరద నీరు చేరింది.

# బెల్ట్ తీయడం లేదు...



బి.కొత్తకోటలోని ఓ గ్రామంలో బెల్టుషాపులో మద్యం అమ్మకాలు

- ఏ ఊరిలో చూసినా బెల్ట్‌షాపులే..
- కొన్ని చోట్ల బెల్ట్‌షాపులకు వేలం పాటలు
- సరఫరా చేస్తున్న వైన్ షాపుల సిబ్బంది
- క్వార్టర్‌పై రూ.20 నుంచి 50 అదనం
- కన్నెత్తి చూడని ఎక్సైజ్ అధికారులు



పీటీఎం మండలంలో ఆరుబయటే మద్యం తాగుతున్న మందుబాబులు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఏ ఊరిలో చూసినా మద్యం ఏరులై పారుతోంది. గ్రామ గ్రామాన బెల్ట్‌షాపులు ఉన్నాయి. చిన్న బడ్డీ కొట్టు నుంచి పెద్ద దుకాణాల వరకు గ్రామాల్లో బెల్ట్‌షాపులు నడుపుతున్నారు. మద్యం షాపుల నుంచి సిబ్బందే గ్రామాల్లోని బెల్ట్‌షాపులకు మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే బెల్ట్‌షాపులకు వేలం పాటలు నిర్వహించి ఎవరు ఎక్కువ పాడితే వారికే మద్యం సరఫరా చేస్తుండటం గమనార్హం. గతంలో కొందరు జీవనోపాధి కోసం మద్యం దుకాణాల్లో నుంచి మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి.. ఎక్కడో రహస్యంగా దాచి పెట్టుకుని... కొంచెం ఎక్కువ ధరకు అమ్ముకునే వాళ్లు. అది కూడా మద్యం దుకాణాలు మందుబాబులకు అందుబాటులో లేని ఊళ్లలో ఎక్కడో ఒకటో, రెండో బెల్టుషాపులు ఉండేవి. అయితే ఇప్పుడు కాలం మారింది.. బెల్టుషాపులకు అర్థం మారింది.. మద్యం దుకాణదారులే తమ అమ్మకాల కోసం బెల్టుషాపులను ప్రోత్సహిస్తున్నారు. తమ దుకాణంలో పనిచేసే సిబ్బందితో ఆయా బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తున్నారు. జిల్లాలోని దాదాపు ప్రతి గ్రామంలోనూ ఒకటో.. రెండు బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ క్వార్టర్‌పైన రూ.20 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తూ మందుబాబుల జేబులకు కన్నం వేస్తున్నారు. పబ్లిక్‌గానే.. బెల్టుషాపులు నడుస్తున్నా.. అటు పోలీసులు, ఇటు ఎక్సైజ్ పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు మద్యం దుకాణాలు, బెల్టుషాపుల నుంచి నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పోటీ ఎక్కువగా ఉన్నచోట.. బెల్టుషాపుల కోసం వేలం పాటలు కూడా పాడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ములకలచెరువు మండలంలో నకిలీ మద్యం తయారీ, విక్రయాల వ్యవహారం బయటపడిన తర్వాత.. కొన్ని రోజులు ఈ బెల్టుషాపులు మూతపడ్డాయని.. ఇప్పుడు మళ్లీ జోరుగా నడుస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇంకా పలుచోట్ల అనుమతులు లేకుండానే.. మద్యం దుకాణం పక్కనే గదులు ఏర్పాటు చేసి మద్యం తాగిస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి.

రాజంపేట మండలంలో ఆకేపాడు, పోలి, సీతారాంపురం, శేషన్నగారిపల్లె, మందరం వంటి పలు గ్రామాలలో బెల్టుషాపులు కొందరు నిర్వహిస్తున్నారు. పెద్దమండ్యెం మండల పరిధిలో పెద్దమండ్యెం, బండమీదపల్లె పంచాయతీ తురకపల్లెలో రెండు మద్యం షాపులు ఉన్నాయి. మూడు నెలల క్రితం తురకపల్లెలో ఒక మద్యం దుకాణం మూత పడింది. దీంతో ఆ షాపు పరిధిలోని తురకపల్లె, వెలిగల్లు, శివపురం గ్రామాలలో రహస్యంగా కొందరు మద్యం అమ్ముకుంటున్నారు. రోజువారీగా 10 నుంచి 25 బాటిళ్లు ద్విచక్ర వాహనాల్లో తెచ్చుకుంటున్నారు. సి.గొల్లపల్లె, రెక్కలకొండ, బండ్రేవు, కలిచెర్ల, పాపేపల్లె తదితర గ్రామాలలో పలువురు రహస్యంగా మద్యం అమ్ముతున్నారు. పొలాల వద్ద సంచుల్లో పెట్టుకుని ఫోన్ చేసి అడిగిన వాళ్లకు ఇస్తున్నారు. గుర్రంకొండ మండలంలో 15 పంచాయతీలలో సుమారు 60 వరకు బెల్ట్‌షాపులు ఉన్నాయి. ప్రతి గ్రామం నుంచి రెండు, నుంచి మూడు వరకు పోటీ పడి నిర్వహిస్తున్నారు.

కలకడ మండలంలో మూడు మద్యం దుకాణాలు సిండికేట్‌గా ఏర్పడి వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న వాళ్లు నిర్భయంగా అందుబాటులో ఉన్న షాపులో మద్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. దీంతో మారుమూల గ్రామాలైన కోన, ఏనుగొండ, పాలెం, కదిరాయిచెరువు, ముడియంవారిపల్లె, నడిమిచెర్లతో పాటు మిగిలిన గ్రామాలలో కూడా ఒకటి కంటే ఎక్కువ బెల్ట్‌షాపులు వెలిశాయి. వీటితో పాటు చిల్లర అంగళ్లు, ఊర్ల శివార్లలో ఉన్న డాబాలలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. రాజకీయ పలుకుబడి ఉన్న బ్రాందీషాపుల యజమానుల ఆశీస్సులు బలంగా ఉండడంతో పల్లెల్లో క్వార్టర్ ధర ఎమ్మార్పీ కంటే.. కనీసం రూ.30 ఆపై అందిన కాడికి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చిన్నమండెం మండలంలో బెల్ట్‌షాపులు ఉదయం 6 నుంచే మందుబాబులకు అందుబాటులో ఉన్నాయి. బోనమలలో మూడు షాపులు, మల్లూరు క్రాస్ వద్ద రెండు, గొట్టివీడులోలో రెండు బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారు.

సుండుపల్లె మండలంలో బెల్ట్‌షాపులను వేలం పాట ద్వారా కేటాయించారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో బెల్ట్‌షాపులను నిర్వహిస్తున్నట్లు సమాచారం. బీరు బాటిల్‌పైన రూ.30, క్వార్టర్ బాటిల్‌పైన రూ.20 చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు. ఇదంతా పోలీసు ఎక్సైజ్ అధికారులకు తెలిసే జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. గాలివీడు మండలంలో మూడు వైన్‌షాపుల పరిధిలో బెల్ట్‌షాపులు నిర్వహించడం లేదు. గత నెల రోజుల నుంచి గ్రామాలలో ఉన్న బెల్ట్‌షాపులను పూర్తిగా మూసివేశారు. ప్రధాన వైన్‌షాపులు ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకోవడంతో మొత్తం బెల్ట్ షాపులను మూసివేయించినట్లు సమాచారం. ఓబులవారిపల్లె మండలంలో మద్యం షాపుల్లో పనిచేసే వారే వెళ్లి పల్లెల్లో బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారు. మద్యం షాపులు ఉన్న గ్రామాలు మినహాయించి.. మిగిలిన అన్ని గ్రామాలలో బెల్టుషాపులు నడుస్తున్నాయి. వీటిపై తూతూమంత్రంగా పోలీసు దాడులు నిర్వహించి.. కౌన్సెలింగ్ ఇచ్చి పంపుతున్నారు. ఇలా జిల్లా అంతటా దాదాపు ప్రతి గ్రామంలోనూ బెల్టుషాపులు నడుస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు బెల్ట్‌షాపులపై నిఘా ఉంచి మూసివేయించాలని ప్రజలు కోరుతున్నారు.

### బెల్ట్‌షాపులపై ఉక్కుపాదం

జిల్లాలో బెల్ట్‌షాపుల నిర్వహణపై ఉక్కుపాదం మోపుతున్నాము. నేటి వరకు జిల్లాలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న 250 మందిపై 250 కేసులు నమోదు చేశాము. ఈ కేసుల్లో 581 లీటర్ల మద్యంతో పాటు రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్నాము. ములకలచెరువులో నకిలీ మద్యం పట్టుబడిన తర్వాత జిల్లాలోని ప్రతి మద్యం దుకాణం లైసెన్సీల ద్వారా ప్రమాణపత్రం తీసుకున్నాము.

\- మధుసూదన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్

## కుడి కాలువ మరమ్మతులకు

# రూ.20 కోట్లతో ప్రతిపాదన

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వెలిగల్లు కుడి కాలువ మరమ్మతులకు రూ.20 కోట్లతో అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపిస్తున్నామని వెలిగల్లు ప్రాజెక్టు డీఈ కిశోర్‌కుమార్ తెలిపారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లె మండలంలో వెలిగల్లు కుడి కాలువను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలిగల్లు ప్రాజెక్టు నుంచి 1.4 టీఎంసీల నీటిని విడుదల చేశామని, ప్రస్తుతానికి 75 చెరువులు పూర్తిగా నిండాయని, అయితే కొన్ని చెరువులకు నీరు సక్రమంగా వెళ్లడం లేదని, దీంతో కుడి కాలువ మరమ్మతులు చేయిస్తే చెరువులకు నీరు అందుతుందని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కుడి కాలువ, పిల్ల కాలువల మరమ్మతులకు 20 కోట్ల రూపాయలు అంచనాతో ప్రతిపాదనలు పంపిస్తున్నామని ఆయన తెలిపారు. అంతేగాకుండా ప్రతి చెరువుకు నీరు అందించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వెలిగల్లు ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎక్సైజ్ కానిస్టేబుల్ సస్పెన్షన్



- మదనపల్లె, పుంగనూరులో పనిచేస్తున్న నలుగురు అటాచ్‌మెంట్

ములకలచెరువు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు నకిలీ మద్యం కేసులో పలువురు ఎక్సైజ్ కానిస్టేబుళ్ల ప్రమేయం ఉన్నట్లు అభియోగాలు రావడంతో ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ములకలచెరువు ఎక్సైజ్ కానిస్టేబుల్ భాస్కర్‌ను సస్పెండ్ చేస్తూ ఈఎస్ మధుసూదన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నకిలీ మద్యం కేసులో కానిస్టేబుల్ భాస్కర్‌పై వచ్చిన ఆరోపణలు రుజువు కావడంతో సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌లో పనిచేస్తున్న జి.మణిని కార్వేటినగరంకు, ఎం.కిరణ్‌ను వి.కోట చెక్‌పోస్టుకు, పుంగనూరు ఎక్సైజ్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎ.వినోద్‌కుమార్‌ను నరహరిపేట చెక్‌పోస్టుకు, ఎం.నరేంద్రరెడ్డిని క్యాటిల్ ఫారం చెక్‌పోస్టుకు అటాచ్‌చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నలుగురిపై ఆరోపణలు రావడంతో అటాచ్‌మెంట్ చేస్తున్నట్లు చిత్తూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# హౌసింగ్ సర్వేలో జిల్లా ఫస్ట్

- 14లోపు సర్వే పూర్తి చేయాలి
- హౌసింగ్ పీడీ రమేశ్‌రెడ్డి



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ రమేశ్‌రెడ్డి

మదనపల్లె, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద పక్కా గృహానికి చేస్తున్న సర్వేలో జిల్లా ప్రథమస్థానంలో ఉందని హౌసింగ్ పీడీ రమేశ్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఈఈ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ నవంబరు 30వ తేదీతో గడువు ముగియగా, కేంద్ర ప్రభుత్వం లబ్ధిదారులకు మరో 14 రోజులు గడువు పొడిగించిందని, అర్హులైన లబ్ధిదారులు ఈనెల 14వ తేదీలోగా సర్వే పూర్తి చేయించుకోవాలని చెప్పారు. మండలంలోని ప్రతి ఒక్కరూ ఆయా గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లను సంప్రదించి అర్హత నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకు ప్రత్యేకంగా దరఖాస్తు అంటూ ఏమీ లేదని, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల అర్హతను గుర్తించడంతో పాటు వారు ప్రస్తుతం నివాసం ఉన్న ఇంటితో పాటు ఇంటి నిర్మాణం చేపట్టే స్థలంలో మ్యాపింగ్ చేసుకోవాల్సి ఉంటుందని పీడీ వివరించారు. అయిదేళ్ల కాల వ్యవధితో చేపట్టే ఈ ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వం గృహాలు మంజూరు చేస్తోందని, ఇందులో సొంత స్థలం ఉన్నా, లేకున్నా.. డిమాండ్ సర్వేలో నమోదు కావాలని పీడీ సూచించారు. ఇది పూర్తిగా గ్రామీణ ప్రాంతాలకే వర్తిస్తుందన్నారు. గత ప్రభుత్వంలో జిల్లా వ్యాప్తంగా 42,090 మంది లబ్ధిదారులు డిమాండ్ సర్వేలో పేర్లు నమోదు చేసుకోగా, తాజాగా వారి సంఖ్య 62,253 చేరుకుందన్నారు. గతంలోని 42,090 మంది వివరాలు రాష్ట్ర హౌసింగ్ వెబ్‌సైట్‌లో నమోదు చేయగా, తాజాగా పీఎం ఆవాస్ ప్లస్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో సొంత స్థలం ఉన్న వారు 35,231 మంది, స్థలాలు లేని వారు 27,136 మంది ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. సర్వేలో రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లా ప్రథమ స్థానంలో ఉందని, సర్వే పూర్తయ్యే నాటికి లబ్ధిదారుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మంజూరు చేసే ఈ గృహాలకు కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు తీసుకోవాల్సి ఉందని తెలిపారు. సమావేశంలో మదనపల్లె, తంబళ్లపల్లె హౌసింగ్ డీఈలు జి.దీన్‌దయాల్‌రాజు, వై.వెంకటరెడ్డి ఉన్నారు.

# వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 271 రైతు సేవా కేంద్రాల్లో ఈనెల 3న నిర్వహించే రైతన్నా-మీ కోసం కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. రైతుల ఆదాయం పెంపు లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, సాంకేతిక పద్ధతులు, ఆధునిక సాగు విధానాలు గ్రామ గ్రామానికి చేరేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. డీఆర్‌డీఏ, ఏపీఎంలు, పశు సంవర్ధకశాఖ అధికారులు సమన్వయం చేసుకుని గ్రామ స్థాయిలో ఆవులు, గేదెలు ఎవరికీ కావాలో వారి నుంచి దరఖాస్తులను స్వీకరించి బ్యాంకుల ద్వారా రుణాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివనారాయణ, ఉద్యాన శాఖ, సిరికల్చర్, ఏపీఎంఐపీ, పశు సంవర్ధక, మత్స్య, సహకార శాఖ, మార్కెటింగ్, డీఆర్‌డీఏ, మార్క్‌ఫెడ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విజయోత్సవ బైక్ ర్యాలీ



జేఏసీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా సాధన సమితి సభ్యులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెను జిల్లాగా చేస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడంతో ఇక్కడి ప్రజల ఎన్నో ఏళ్ల కల నెరవేరినట్లయిందని మదనపల్లె సాధన సమితి జేఏసీ నాయకులు అన్నారు. మంగళవారం మదనపల్లె పట్టణంలో విజయోత్సవ బైక్ ర్యాలీని మదనపల్లె జిల్లా సాధన సమితి జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కదిరి రోడ్డులోని టిప్పుసుల్తాన్ మైదానం నుంచి ఎన్టీఆర్ సర్కిల్, అనిబిసెంట్ సర్కిల్, బెంగళూరు బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం సీటీఎం రోడ్డు, టౌన్‌బ్యాంకు సర్కిల్, చిత్తూరు బస్టాండ్ సర్కిల్, గాంధీ రోడ్డు, నిమ్మనపల్లె సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు షేక్ రెడ్డిసాహెబ్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శనం, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్, బహుజన సేన అధ్యక్షుడు శ్రీచందు, డాక్టర్ ఎస్‌కే బాషా, నాగరాజ, మహమ్మద్‌ఆలీ, మహబూబ్‌పీర్, గుండా మనోహర్, చంద్రయ్య, మల్లెల మోహన్, సహదేవ, బాలాజీ, గంగాధర్, శివ, మహేశ్, ప్రశాంత్, హరి, ఆనంద్, రెడ్డెప్ప గంగయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు కుటుంబాలకు ఆరోగ్య భరోసా

- పోలీస్ యూనిట్ వెల్ఫేర్ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో ఎస్పీ



పోలీసు యూనిట్ వెల్ఫేర్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు సిబ్బంది, హోంగార్డులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ యూనిట్ వెల్ఫేర్ ఆసుపత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సంక్షేమమే జిల్లా పోలీసుశాఖకు ప్రథమ బాధ్యతని స్పష్టం చేశారు. అలాగే ఈ ఆసుపత్రి ద్వారా పోలీసు సిబ్బందికి, వారి కుటుంబాలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఇక్కడ అన్ని రకాల ప్రాథమిక వైద్య సదుపాయాలతో పాటు అవసరమైన మందులు ఉచితంగా అందుబాటులో ఉంటాయన్నారు. తరచుగా ఒత్తిడికి గురయ్యే సిబ్బందికి భవిష్యత్తులో మానసిక ఆరోగ్య కౌన్సిలింగ్ సేవలు కూడా అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ ఆసుపత్రి ద్వారా ప్రతి మంగళవారం జనరల్ డాక్టర్ అందుబాటులో ఉండి సాధారణ వైద్య సేవలు అందిస్తారన్నారు. ప్రతి శుక్రవారం స్పెషలిస్ట్ డాక్టర్ అందుబాటులో ఉండి ప్రత్యేక చికిత్సలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, రాయచోటి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్లు రామరాజు, రాధిక, అబ్దుల్ లతీఫ్, ఏఏవో జె.త్రినాధసత్యం, పలువురు సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, డీపీవో సిబ్బంది, మహిళా పోలీసులు, హోంగార్డులు, పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## దమ్ము, ధైర్యం ఉంటే

# అసెంబ్లీకి రండి చర్చిద్దాం

- రాయచోటి కేంద్రంగానే అన్నమయ్య జిల్లా : మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి (నేతాజీ సర్కిల్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్‌రె డ్డి అప్పుడప్పుడు ట్విట్టర్, జైలు పర్యటన, రైతుల నోట్లో మట్టి కొట్టే కార్యక్రమాల్లో కనిపిస్తున్నాడని, దమ్ము, ధైర్యం ఉంటే 11 మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీకి వస్తే చర్చిద్దామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం రాయచోటిలో మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ అసెంబ్లీలో చర్చించి మా తప్పు ఎత్తి చూపితే సరిదిద్దుకోవడానికి మేము సిద్ధంగా ఉన్నామన్నారు. ఉమ్మడి కడప జిల్లాకు చెందిన జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో అభివృద్ధి చేసి ఉంటే రాయచోటి, కదిరి, కడప, కమలాపురం, ప్రొద్దుటూరు సీట్లలో ఎందుకు ఓడిపోయారో చెప్పాలన్నారు. పార్టీ కేడర్‌ని నిలుపుకునేందుకు పౌరుషం మాటలు మాట్లాడడం సబబు కాదన్నారు. ప్రజల్లో అపోహలను పోగొట్టేందుకు రాయచోటి కేంద్రంగా అన్నమయ్య జిల్లాను కొనసాగించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి ఉపసంఘం నిర్ణయం తీసుకుందని తె లిపారు. ఉమ్మడి కడప జిల్లాలో ఉన్న ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను అన్నమయ్య జిల్లాలో కలుపుతూ 3 నియోజకవర్గాలతో రాయచోటి కేంద్రంగా అన్నమయ్య జిల్లాను గెజిట్ చేసినట్లు తెలిపారు. రాయచోటి పట్టణంలో సుద్దలవాండ్లపల్లె రోడ్డులో రూ.9.5 కోట్లతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రాయచోటి పట్టణంలో రెండో బస్టాండు ఏర్పాటుకు, ఆయుష్ ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. సమావేశంలో అర్చనా విద్యాసంస్థల అధినేత మదన్‌మోహన్‌రెడ్డి, రాయచోటి క్లస్టర్ ఇన్‌చార్జ్ గాజుల ఖాదర్‌బాషా, ఏపీఐఐసీ డైరెక్టర్ కొండా భాస్కర్‌రెడ్డి, పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర నాయుడు, సంబేపల్లె క్లస్టర్ ఇన్‌చార్జ్ విష్ణువర్ధన్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, పలువురు టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణలో కోనేటిగుంత

- ఏళ్ల తరబడి గుంతను పూడ్చక...
- సర్వే చేయక నిరుపయోగంగా..
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

చెన్నూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రభారతిపేటలోని కోనేటి గుంత రోగాలకు ఆక్రమణకు గురవుతోంది. చాలా ఏళ్లక్రితం ఈ గుంతలోని నీరు వ్యవసాయ పొలాలకు ఉపయోగపడేది. ఇదే ప్రాంతం పైభాగంలో ఉన్న రుద్రభారతిపేట చెరువు నుంచి నీరు వచ్చి కోనేటి గుంతకి చేరి.. అక్కడ నుంచి చిన్నమాచుపల్లె వ్యవసాయ పొలాలకు కాల్వల



కోనేటి గుంత స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు

### విలువ రూ2కోట్లు పైనే...

రుద్రభారతి కోనేటి గుంతకు చుట్టూ ఉన్న స్థలం విలువ ప్రైవేటు మార్కెట్‌లో సెంటు రూ.3లక్షలు పైమాటే పలుకుతుంది. దీంతో ఈ స్థలం విలువ రూ.2 కోట్లు ఉంటుంది. సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి ఆ కోనేటి గుంత స్థలానికి కొలతలు వేసి ఫెన్సింగ్ వేయడమా, లేక గుంత పూడ్చి ప్రజలకు ఇంటిపట్టాలు ఇవ్వడమా చేయాలని కోరుతున్నారు.

ద్వారా ఉపయోగపడేది. ఈక్రమంలో రుద్రభారతి పేట ప్రాంతంలో ప్రభుత్వం కొందరికి ఇంటిస్థలాలు కేటాయించింది. దీంతో 2002 నుంచి ఈ ప్రాంతంలో ఇంటి నిర్మాణాలు జరిగాయి. అయితే ఆ కోనేటి గుంత ( సర్వే నెం.138లో 75 సెంట్లుపైగా) లోతు ఎక్కువగా ఉందని దాన్ని వదిలేశారు. అయితే నాటి నుంచి నేటి వరకు గుంతలో నీరు వ్యవసాయ పొలాలకు వెళ్లే మార్గం లేక నిరుపయోగంగా మారింది. దీంతో కోనేటిలో పంట కాల్వ వ్యర్థాలు పడి దోమలకు నిలయంగా మారింది. దీంతో చీకటి పడితే దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని ఆప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కబ్జారాయుళ్ల కన్ను...

ప్రభుత్వం 2006 నుంచి ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టడంతో పలు చోట్ల గుంతలను పూడ్చడం జరుగుతోంది. అదే విధంగా రుద్రభారతిపేట కోనేటి గుంతను కూడా పూడ్చిస్తే ప్రజలకు



రుద్రభారతిపేటలో నిరుపయోగంగా ఉన్న కోనేటి గుంత

ఉపయోగపడుతుందని పలువురు అంటున్నారు. చాలా కాలంగా రోడ్డు పక్కనే ఈ గుంత ఉండడంతో కొంతమంది కబ్జాదారుల కన్ను దీనిపై పడింది. గతంలో కోనేటి గుంత విస్తీర్ణం ఎక్కువగా ఉండేది. ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఇంటి ప్లాట్లు కేటాయించడంతో కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. దీంతో కోనేటి గుంత చుట్టూ ఉన్న స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. కోనేటి గుంత స్థలం కబ్జాకు గురవుతోందని.. సర్వే చేసి చుట్టూ ఫెన్సింగ్ వేయాలని చాల మంది రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇంత వరకు ఆ గుంతను సర్వే చేసిన పాపానపోలేదు. దాదాపు 22 ఏళ్లుగా పట్టించుకునేవారే లేరు. దీంతో ఈ స్థలం మాదంటూ పోర్జరీ పట్టాలు తయారు చేసుకుని ఆక్రమించారు. ఇక కొందరు గుంత స్థలం మాది, మా పూర్వీకులది అంటూ తప్పుడు డాక్యుమెంట్లు చూపిస్తూ ఆక్రమించే ప్రయత్నం చేయడంతో ఇటీవల రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. కాగా, ఈ విషయమై తహశీల్దార్ సరస్వతిని వివరణ కోరగా.. కోనేటి గుంత విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

## వసంతపేట పాఠశాలలో త్రీమెన్ కమిటీ విచారణ



విద్యార్థులను విచారిస్తున్న త్రీమెన్ కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరుటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక వసంతపేట మున్సిపల్ హైస్కూలులో నవంబరు 28వ తేదీ మధ్యాహ్న భోజనం ఫుడ్‌పాయిజన్ కావడంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటనపై ప్రభుత్వం విచారణకు ఆదేశించి త్రీమెన్ కమిటీ సభ్యులను నియమించింది. ఈ మేరకు కడప డిప్యూటీ డీఈవో రాజగోపాల్‌రెడ్డి, ఫుడ్ఇన్‌స్పెక్టర్ హరిత, తహసీల్దారు గంగయ్యను నియమించింది. మంగళవారం వారు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన విద్యార్థులను విచారించారు. ఆరోజు జరిగిన సంఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ఏం జరిగిందో లిఖితపూర్వకంగా రాసి ఇవ్వాలన్నారు. అలాగే ఆరోజు మధ్యాహ్న భోజనం రుచి చూసిన ఉపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులను విచారించారు. అనంతరం పాఠశాలలో ఉన్న వంటగదిని పరిశీలించారు. బాత్‌రూం పక్కన ఉన్న వంట గదిని మరో చోటికి మార్చాలని సూచించారు. స్టోరూంను పరిశీలించి గాలి, వెలుతురు ఉండేటట్లు ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయుడు గురప్పను ఆదేశించారు. ఈ విచారణకు వంట ఏజెన్సీ నిర్వాహకులు అందుబాటులోకి రాలేదని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం ఫుడ్‌పాయిజన్‌పై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని డిప్యూటీ డీఈవో రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

## జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు పోట్లదుర్తి విద్యార్థిని



ఎర్రగుంట్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోట్లదుర్తి ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.అనుపమ రాష్ట్రస్థాయిలో జరిగిన అండర్-14 ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శివరాం తెలిపారు. ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అనుపమ గత నెల అనకాపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యిందన్నారు. జనవరిలో రాజస్థాన్‌లో జరగబోవు జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థిని ఎంపిక పట్ల ప్రధానోపాధ్యాయుడితో పాటు పీడీలు లక్ష్మి, సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## రాష్ట్రస్థాయి కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలకు విద్యార్థి ఎంపిక



ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈనెల 27వ తేదీ జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరిగే రాష్ట్ర స్థాయి కౌశల్‌సైన్స్ క్విజ్ పోటీలకు స్థానిక ఎస్‌పీసీఎస్ రామేశ్వరం మున్సిపల్ పాఠశాల విద్యార్థి ఎంపికయ్యాడు. ఆ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఎంజర్ల ప్రవీణ్‌రెడ్డి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో ఆ విద్యార్థి ద్వితీయస్థానం సాధించడంతో రాష్ట్రస్థాయిపోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు సత్యబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

## 21న విశాఖలో మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డింగ్ పోటీలు

కడప స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో ఈ నెల 21న మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డింగ్ కాంపిటీషన్ పోటీలు జరగనున్నట్లు స్టేట్ బాడీబిల్డింగ్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ న్యామతుల్లా వెల్లడించారు. మంగళవారం కడపలోని జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేసన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. న్యూ ఆంధ్ర బాడీ బిల్డింగు అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న పై పోటీల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనేలా చూడాలని కోరారు. జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు తారిక్‌ఆలీ, సెక్రటరీ అన్సర్‌ఆలీ ట్రెజరర్ ఇంతియాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

## వివాహిత అదృశ్యం



ప్రొద్దుటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం ఈశ్వర్‌రెడ్డినగర్‌కు చెందిన వద్ది సాయి రూప అనే వివాహిత అదృశ్యమైంది. వన్‌టౌన్ ఎస్‌ఐ సంజీవ రెడ్డి వివరాల మేరకు... వద్ది మధుసూదన్ సాయిరూపను 8 ఏళ్ల క్రితం ప్రేమవివాహం చేసుకున్నారు. ఆమె థైరాయిడ్ సమస్య కారణంగా పిల్లలు పుట్టలేదని బాధపడుతూ వుండేదని, డిసెంబరు 1న తెల్లవారు జామున ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి కనబడుట లేదని వద్ది మధుసూదన్ ఫిర్యాదు చేశాడు ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

ప్రొద్దుటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం గాంధీ రోడ్డులో సోమవారం రాత్రి అతిగా మద్యం తాగి ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడిపోయాడు. స్థానికులు అంబులెన్సుకు ఫోన్ చేయడంతో అంబులెన్సు సిబ్బంది జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఆసుపత్రిలోని ఔట్ పోస్టు పోలీసులు అతని వివరాలపై ఆరా తీశారు. అతని జేబులో దొరికిన రేషన్‌కార్డు ఆధారం మేరకు మృతుని గౌస్ మోహిద్దీన్‌గా గుర్తించి.. అతని భార్య రేష్మకు సమాచారం అందించారు. తన భర్త ఆటో కొనుక్కోవాలని చెప్పి ఇంట్లో పదివేలు డబ్బులు తీసుకొని వెళ్లాడని, మద్యానికి బానిసై లివర్ కూడా దెబ్బతిందన్నారు. భార్య ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

## కత్తితో దాడి.. ఒకరికి తీవ్ర గాయాలు

చిట్వేలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుడితినీళ్ల విషయంలో ఏర్పడిన వివాదంలో ఓ వ్యక్తి కత్తి పోట్లకు గురయ్యాడు. మండల పరిధిలోని నాగవరం గ్రామంలో మంగళవారం పశువులకు నీరు తాగించే తొట్టి వద్ద జగదాబి ప్రసాద్‌రాజు పవన్‌కుమార్‌రెడ్డి గొడవ పడ్డారు. దీంతో ఆగ్రహించిన ప్రసాద్ రాజు కత్తితో దాడి చేయడంతో పవన్‌కుమార్‌రెడ్డి కడుపులో తీవ్ర గాయాలై పేగులు బయటకు వచ్చాయి. క్షతగాత్రుడిని కుటుంబసభ్యులు కోడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతిలోని రుయాకు తీసుకెళ్లారు. ఈ విషయమై కోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులును వివరణ కోరగా విచారణ అనంతరం కేసు నమోదు చేస్తామన్నారు.

## నాణ్యతతో రుచికరంగా భోజనం అందించాలి

- సెంట్రలైజ్డ్ స్మార్ట్‌కిచెన్ల తనిఖీలో కలెక్టర్

జమ్మలమడుగు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని.. విద్యార్థులకు నాణ్యతతో రుచికరమైన భోజనం అందించాలని వంట ఏజెన్సీలకు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సూచించారు. మంగళవారం జమ్మలమడుగు నియోజకవర్గ పర్యటనలో భాగంగా మొదట దేవగుడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్మార్ట్‌కిచెన్ నిర్వహణ తీరును పరిశీలించి.. అక్కడున్న వంట ఏజెన్సీ సిబ్బందితో మాట్లాడారు. రోజువారి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. భోజనం శుచిగా, రుచిగా అందిస్తున్నారా అంటూ ప్రశ్నించారు. అనంతరం జమ్మలమడుగు పట్టణంలోని పతంగే రామన్నరావు జిల్లా పరిషత్ హైస్కూలులో స్మార్ట్‌కిచెన్‌ను పరిశీలించి... వంట నిర్వహణ ఏజెన్సీలతో మాట్లాడారు. అన్నం, చెట్నీ రుచి చూసిన కలెక్టర్ మరింత నాణ్యతగా అందించాలని సూచించారు. స్టోర్‌రూములను, ఆర్వో ప్లాంట్లను పరిశీలించారు. నిర్వహణకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలని కోరారు. సేవా భావంతో పిల్లలకు భోజనం అందించాలని సూచించారు. రాష్ట్రానికే ఆదర్శంగా జిల్లాలో నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్‌కిచెన్లను జిల్లాలోని అన్ని మండలాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దారు శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ పీడీ రాజారత్నం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు పీఆర్ హైస్కూలులో భోజనం పరిశీలిస్తున్న కలెక్టర్

## మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి



జమ్మలమడుగు సబ్ డివిజనల్ పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లు, గతంలో ఎన్నికల నేరాలకు పాల్పడిన వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జమ్మలమడుగు సబ్ డివిజన్ పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. బాలికలు, మహిళల వేధింపులపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామసభలు, పల్లెనిద్ర, గ్రామాల సందర్శన తప్పని సరిగా నిర్వహించాలన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా గంజాయి, ఇతర మత్తుపదార్థాలు, బహిరంగ మద్యపానం చేసేవారిపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లు, గతంలో నేరాలకు పాల్పడిన వారి కదలికలపై దృష్టి పెట్టాలన్నారు. శక్తిటీంలు పనితీరు మెరుగుపరచుకోవాలన్నారు. సమావేశంలో అడిషన్ ఎస్పీ కె.ప్రకాశ్‌బాబు, జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సబ్ డివిజనులోని సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ అండర్ 14 ఇంటర్ జోనల్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. వివరాలిలా... కేఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో నార్త్‌జోన్‌విన్నర్స్-సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు 90 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 272 పరుగులు చేసింది. అనంతరం సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టు రెండో రోజు 90 ఓవర్లలో ఆట ముగిసే సమయానికి ఐదు వికెట్లు కోల్పోయి 291 పరుగులు చేసింది. ఇందులో తమన్‌సాయి 111 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో సెంట్రల్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 20 పరుగుల ఆధిక్యత సాధించింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

కేఓఆర్‌ఎం మైదానంలో సౌత్‌జోన్ - రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ మధ్య జరిగిన మ్యాచ్‌లో రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 69.5 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ దిగిన రెస్ట్‌ఆఫ్ నార్త్ జోన్ జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి రెండు వికెట్లు కోల్పోయి 62 పరుగులు చేసింది. మంగళవారం తిరిగి బ్యాటింగ్ చేపట్టి 63.5 ఓవర్లలో 197 పరుగులు చేసి ఆలౌట్ అయింది. కాగా బౌలింగ్ విభాగంలో రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ బౌలరు రోహిత్ ఆరు వికెట్లు పడగొట్టడం విశేషం. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు బ్యాటింగ్ దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 97 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 158 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్‌ను డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

ఏసీఏ క్రికెట్ మైదానంలో వెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ - సౌత్ జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 76 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 193 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం రెండోరోజు బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్‌ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 78 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 303 పరుగులు చేసింది. ఇందులో రాజ్ 129 పరుగులు చేశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.



తమన్‌సాయి, రోహిత్, రాజ్

## భూఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

కలసపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ హెచ్చరించారు. మంగళవారం ఆయన కలసపాడు మండలంలో పర్యటించారు. బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన రైతు వెంకటరమణ ఆత్మహత్యపై స్థానికులు, పోలీసులు, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బందితో కలిసి విచారణ జరిపారు. కలసపాడులోని సర్వేనెంబర్ 240లోని స్థలాన్ని పరిశీలించారు. రెండు రోజుల పాటు జరిగే గుడి తిరుణాళ ఏర్పాట్లను పరిశీలించారు. తహసీల్దారు కార్యాలయంలో చెన్నుపల్లె భూములపై చర్చించారు. ఇటీవల ఆక్రమణలకు గురవుతున్న శంఖవరం రెవెన్యూ పరిధిలోని 2707 సర్వే నెంబర్ భూములను ఆయన పరిశీలించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక రెవిన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట పోరుమామిళ్ల సీఐ హేమసుందర్, తహసీల్దార్ మధురవాణి, డీటీ మోహన్‌రాజు, ఆర్ఐ సింధూజ, ఎస్‌ఐ తిమోతి, వ్యవసాయశాఖ అధికారులు, ఫారెస్ట్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

### జాతీయ రహదారి పనుల పరిశీలన

పోరుమామిళ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అమరావతి - బెంగుళూరు ఆరు లేన్ల రహదారి పనులను బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ పరిశీలించారు. మంగళవారం ఆయన పోరుమామిళ్ల మండలంలోని సంచర్ల గ్రామంలో భూ విషయమై పరిశీలించారు. అనంతరం చెన్నారెడ్డిపేట సమీపంలో ఆరు లేన్ల రహదారికి సంబంధించి రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కొందరు తమకు ఇంకా నష్టపరిహారం అందలేదనే విషయం ఆయన దృష్టికి తెచ్చారు. పరిశీలించి భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు. ఈ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి ఇంకా 30 మంది రైతులకు నష్టపరిహారం అందాల్సి ఉంది. కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఆక్రమిత భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రమోహన్

## అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు : డీఎస్పీ





మైనార్టీ నేతలతో మాట్లాడుతున్న పోలీసులు, నిర్మాణంలో ఉన్న గదులకు నోటీసులు అంటిస్తున్న పంచాయతీ సిబ్బంది

చెన్నూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ పరిధిలో ఎటువంటి నిర్మాణాలైన అనుమతి లేకుండా చేపడితే చట్టపరంగా చర్యలు తప్పవని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. చెన్నూరు ఖిల్లా మసీదు ఆవరణలో గత కొద్దిరోజులుగా రూముల నిర్మాణాలు చేపడు తున్నారు. దీనిపై గతంలో ఇక్కడ పంచాయతీ అనుమతులు లేవని నోటీసులు ఇచ్చి నిలిపి వేశారు. ఈ విషయమై గత కొద్దినెలలుగా అటు పంచాయతీ, ఇటు పోలీసులు, మైనార్టీ నేతల మధ్య చర్చలు జరుగుతున్నాయి. అయితే మంగళవారం తిరిగి అదే గదులకు పైకప్పు వేసేందుకు మైనార్టీ నేతలు ప్రయత్నించారు. ఈ విషయం పంచాయతీ అధికారులకు తెలియడంతో వారు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డీఎస్పీ ఆదేశాల మేరకు సీఐ క్రిష్ణారెడ్డి, కమలాపురం సీఐ రోషన్, కడప, సీకేదిన్నె, వల్లూరు ఎస్‌ఐలు తులసి నాగప్రసాద్, శ్రీనివాసులరెడ్డి, పెద్ద ఓబన్నలు మసీదు వద్దకు వచ్చి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. దీంతో మైనార్టీ నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మసీదు స్థలంలో కట్టుకోవడానికి తమకు హక్కు ఉందని.. దీంట్లో ఎవరి ప్రమేయం అవసరం లేదన్నారు. ఇందుకు పోలీసులు ఇప్పటికే ఈ పంచాయతీ కలెక్టరు, ఎస్పీ దృష్టిలో ఉందని, ఆర్డీవో అనుమతి తీసుకున్న తరువాతే నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఒక దశలో ఈ విషయం కాస్త శ్రుతి మీరడంతో పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, ఇష్టానుసారం నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పంచాయతీ సిబ్బంది నిర్మాణాలు చేపడు తున్న గదులకు నోటీసులు అంటించారు. అనుమతి ఉంటేనే నిర్మాణాలు చేపట్టాలంటూ నోటీసుల్లో పేర్కొన్నారు.

## గుంజనేరుకు వరద

పెనగలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంజనేరుకు వరద పోటెత్తింది. తిరుపతి, రేణిగుంట, రైల్వేకోడూరు, చిట్వేలి ప్రాంతాల నుంచి రెండు రోజులుగా వర్షపునీరు, గుంజనేరుకు చేరడంతో మంగళవారం ఉదయం గుంజనేరులో భారీ ప్రవాహం కనిపించింది. వెలగచర్ల సమీపంలోని అలుగుపై రెండు అడుగుల ఎత్తుమేర నీరు ప్రవహిస్తోంది.

## డిప్యూటీ ఎంపీడీవోగా నాగేంద్ర వరప్రసాద్‌బాబు



లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె మండల డిప్యూటీ ఎంపీడీవోగా నాగేంద్ర వరప్రసాద్‌బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పెద్ద తిప్పసముద్రం మండలం సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయన ప్రమోషన్‌పై డిప్యూటీ ఎంపీడీవోగా నియమితులయ్యారు.

## జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారిగా నందకిశోర్



రాయచోటి నేతాజీ సర్కిల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండల గ్రామ, వార్డు సచివాలయాల అధికారిగా నందకిశోర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాయచోటి పంచాయతీరాజ్ సబ్ డివిజన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై సంబేపల్లె మండల జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారిగా మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ వార్డు సచివాలయాల్లో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో కలిసి పనిచేస్తామని తెలియజేశారు. అందరి సమన్వయంతో సంబేపల్లె అభివృద్ధి చేపడతామన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ కొండారెడ్డి హెచ్చరించారు. మంగళవారం కోనంపేట సచివాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. మహిళలపైదాడులు, అత్యాచారాలు అరికట్టేందుకు ముందుకు రావాలన్నారు. సైబర్ నేరాలు అరికట్టేందుకు పోలీసులు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లో సంచరించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వెంటనే పోలీసులు తెలపాలన్నారు. గ్రామాల్లో గొడవలు పడకుండా సర్దుకుపోవాలన్నారు. సర్పంచ్ లక్ష్మీనారాయణ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నారా లోకేశ్‌ను కలిసిన సురేందర్ రెడ్డి



నారాలోకేశ్‌తో సురేందర్‌రెడ్డి

రామాపురం, డిసెంబరు 2(ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీని వాసులును మంగళ వారం విజయ వాడలో కలిసినట్లు తెలుగుదేశం పార్టీ మండలశాఖ అధ్యక్షుడు గాలివీటి సురేందర్ రెడ్డి తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారు సూచించినట్లు వివరించరు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం

రామాపురం, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): స్థానికులు మిక్కిలినేని బాలాజీ, మిక్కిలినేని భార్గవి దంపతుల కుమారుడు మిక్కిలినేని హితాన్ష్ వెంకట్ పుట్టినరోజు సందర్భంగా ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదానం చేసినట్లు లయన్ పసుపులేటి శ్యామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజనల్ ఛైర్మన్ లయన్ మహమ్మద్, ఆశ్రమం సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు రైతుసేవా కేంద్రాల్లో 'రైతన్నా.. మీకోసం'

పెనగలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెనగలూరు-1, 2 ఓబిలి, పొందలూరు, కట్టవారిపల్లె, కొండూరు 1, 2 రైతుసేవా కేంద్రాల పరిధిలో రైతన్నా మీకోసం సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఏవో సుబ్రమణ్యం తెలిపారు. ఈ సమావేశాల్లో పౌరులు, రైతులతో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొని రైతులు వ్యవసాయాభివృద్ధికి తగు సూచనలు, సలహాలివ్వాలని ఆయన కోరారు.

## అభివృద్ధి మాటున..

# పొంచి ఉన్న ప్రమాదం

● అభ్యంతరం వ్యక్తం చేస్తున్న ప్రజలు



పెద్ద ఓరంపాడు - రెడ్డిపల్లె మార్గంలో రోడ్డు పక్కన నాటిన విద్యుత్ స్తంభాలు

ఓబులవారిపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ లైన్ల ఏర్పాటులో నిబంధనలు పాటించడం లేదని, దీంతో భవిష్యత్తులో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మంగళంపల్లె, కాకర్లవారిపల్లె, బోటుమీదపల్లెకు వెళ్లే రహదారిలో తారురోడ్డు పక్కన కనీసం మీటరు దూరం కూడా లేకుండా స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు.ఈ విషయంపై అభ్యంతరం వ్యక్తం చేయగా తమకు ఇష్టమొచ్చినట్లు చేస్తామని బెదిరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా రోడ్డు పక్కన ఉన్న వృక్షాలను విచక్షణారహితంగా కొట్టివేస్తున్నారని పర్యావరణ ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కన కనీసం ఒక మీటరు స్థలమైనా వదలకుండా స్తంభాలు నాటుతుండడంతో ఇరుకైన రోడ్లలో వాహనాలు ఎదురెదురుగా వచ్చినపుడు ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలున్నాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే తాము వచ్చి మాట్లాడుతామని అంటున్నారు కానీ, చేసిందేమీ లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్ బీ రోడ్ల పక్కన స్తంభాల ఏర్పాటులో నిబంధనలు పాటించడం లేదని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకున్నా పాపాన పోలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారం అభివృద్ధి పనుల మాటున భవిష్యత్‌లో ప్రమాదాలకు ప్రణాళికలు వేస్తున్నట్లు ఉందని పలువురు వాహనదారులకు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం జిల్లా స్థాయి అధికారులైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ఫిర్యాదులు పరిశీలిస్తాం..**

రూరల్ డెవలప్‌మెంట్ స్కీం కింద కన్‌స్ట్రక్షన్ విభాగంవారు పనులు చేస్తున్నారు. స్తంభాలు నాటే క్రమంలో గ్రామాల్లో తాగునీటి కనెక్షన్లు పోతున్నాయని గ్రామీణ రహదారులకు సంబంధించి కనీస దూరం పాటించలేదని ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. పరిశీలించి వారికి సూచనలు చేస్తాం.

- కిరణ్‌కుమార్, ఏఈ

## రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని మహిళల ఆందోళన





డీబీఎన్‌పల్లెలో ఆందోళన చేస్తున్న మహిళలు, అమరావతిలో సీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి

రాజంపేట/రైల్వేకోడూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలన్న డిమాండ్‌తో మంగళవారం మండలంలోని బసినాయుడుగారిపల్లెలో మహిళలు గ్రామ చావిడి వద్ద ఆందోళన చేశారు. అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు బాసినేని వెంకటేశ్వర్లునాయుడు పాల్గొన్నారు. రాజంపేటలో జేఏసీ నాయకులు అబ్బూరు ప్రభాకర్ నాయుడు, తరిగోపుల లక్ష్మీనారాయణ, పూల విజయభాస్కర్, గీతాంజలి రమణ, మైనార్టీ నాయకులు అబూబకర్ తదితరులు జిల్లా సాధన సమితి నేతలతో సమావేశమయ్యారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలను గ్రామ గ్రామాన తీవ్రతరం చేస్తామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డీసీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌ను కలిసి తమ కోర్కెలను ఆమోదించాలని కోరుతామని తెలిపారు.

**నేడు పాదయాత్ర**

బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేనపార్టీ పార్లమెంటరీ కన్వీనర్ అతికారి కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర అన్నిపార్టీల నాయకులతో కలసి రాజంపేట పాతబస్టాండు నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించనున్నారు. సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నారు.

## కంచాలమ్మ గండి చెరువుకు జలహారతి



కంచాలమ్మ గండి చెరువుకు జలహారతి ఇస్తున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎగువ అబ్బవరం సమీపంలో గల కంచాలమ్మ గండి చెరువుకు మంగళవారం రాయచోటి నియోజకవర్గ టీడీపీ నేత డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి జలహారతి సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ 450 ఎకరాల ఆయకట్టు కలిగిన ఈ చెరువు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, ఏపీఐఐసీ డైరెక్టర్ కొండా భాస్కర్‌రెడ్డి, కంచాలమ్మ గండిచెరువు ఆయకట్టు కమిటీ సభ్యులు రామకృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి, రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ రామయ్య, విష్ణు, రామాంజుల్‌రెడ్డి, రవి, ఓబుల్ రెడ్డి, రాజారెడ్డి, రాజేంద్ర, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్ పరిశీలన



అన్న క్యాంటీన్‌లో నిర్వాహకులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

రాజంపేట టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందించాలని, క్యాంటీన్ ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచాలన్నారు. అవసరమైన మరమ్మతులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ డీఈఈ హేమశేఖర్‌కు సూచించారు. అన్న క్యాంటీన్ సేవల నాణ్యత, పరిశుభ్రత, మరమ్మతులపై నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలియజేశారు.

## మండల యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ఒంటిమిట్ట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట మండలం యూటీఎఫ్ అధ్యక్షురాలుగా భాగ్యలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం సాయంత్రం కడప యూటీఎఫ్ భవనంలో నిర్వహించిన మండల కౌన్సిల్ సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా సీవీ రమణ వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షురాలిగా భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా మాలే బాబు, గౌరవాధ్యక్షుడుగా బాషా, సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాళ్యం మహేష్‌బాబు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం కార్యదర్శిగా గుంటి శివయ్య

పుల్లంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాయలసీమ ప్రాంతీయ పద్మశాలి సంఘ కార్యనిర్వాహక కార్యదర్శిగా పుల్లంపేటకు చెందిన గుంటి శివయ్య నియమితులయ్యారు. ఈ మేరకు రాయలసీమ ప్రాంతీయ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కొంకతి లక్ష్మీనారాయణ నుంచి మంగళవారం నియామక పత్రం అందుకున్నారు. తన నియామకానికి కృషి చేసిన జిల్లా అధ్యక్షుడు చెన్న వెంకటకృష్ణయ్యకు శివయ్య కృతజ్ఞతలు తెలియజేశారు.

## సత్యసాయి జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా కిశోర్‌రాజు



చిట్వేలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సత్య సాయి జిలా క్రీడాభివృద్ధి అధికారిగా తాను నియమితుడైనట్లు పాతచిట్వేలికి చెందిన బాలరాజు కిశోర్‌రాజు మంగళవారం తెలిపారు. తాను గతంలో నంద్యాల జిల్లా కోర్టు అథారిటీ వాలీబాల్ కోచ్‌గా విధులు నిర్వహించానని తెలిపారు. ప్రస్తుతం సత్యసాయి జిల్లా క్రీడాభివృద్ధికారిగా సోమవారం బాధ్యతలు తీసుకున్నట్లు వివరించారు.

## మేతపోరంబోకు ఆక్రమణపై రైతుల ఆగ్రహం



భూమి ఆక్రమణపై నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

గాలివీడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):గరుగుపల్లి గ్రామ పంచాయతీలోని పిలుగుంట్రరాళ్ల గుట్ట వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని స్థానిక రైతులు ఆరోపించారు.మంగళవారం వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 696లో 3.80 ఎకరాలు, సర్వే నెంబర్ 697లో 5.44 ఎకరాల ప్రభుత్వ భూమిని దశాబ్దాలుగా పశువుల మేత కోసం వినియోగించుకుంటూ, అక్కడే పశువులతో ఆవాసం ఏర్పరుచుకుని జీవిస్తున్నామని, ఆ భూమిపై కన్నేసిన ఆక్రమణదారులు ఆ స్థలాన్ని చదును చేస్తున్నారన్నారు. వారి చర్యలను వెంటనే అడ్డుకోవాలంటూ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## మెగా పేరెంట్స్ మీటింగ్‌ను జయప్రదం చేయండి

గాలివీడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు 5న ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో నిర్వహించ తలపెట్టిన మెగా పేరెంట్స్ మీటింగ్‌ను జయప్రదం చేయాలని మండల విద్యాధికారి పిల్లి నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయ సభా భవనంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా పేరెంట్- టీచర్ మీట్‌లో విద్యార్థుల పురోగతితో పాటు విద్యా ప్రమాణాలు, సమస్యలపై చర్చించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాటు ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, దాతలు పాల్గొనాలన్నారు.

## పేదలకు ఆహారం పొట్లాలు పంపిణీ



భోజనం పంపిణీ చేస్తున్న మందల నాగేంద్ర

రైల్వేకోడూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా నాలుగు రోజులుగా పనులకు వెళ్లలేని నిరుపేదలకు భోళాశంకర్ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు మందల నాగేంద్ర, సభ్యులు సీహెచ్ రమేష్‌బాబు, వాసా బాబు, కొప్పుల శంకరయ్య, కిన్నెర శేఖర్, శివ, పెనుగొండ సుబ్బరాయుడు, ఇనమాల చైతన్య, ఆంజేయులు, చెన్నంశెట్టి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్‌కు సన్మానం



అనూరాధను సన్మానిస్తున్న తెలుగునాడు ఉపాధ్యాయ సంఘ నాయకులు

రాయచోటి నేతాజీ సర్కిల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సమగ్ర శిక్షలో అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎన్. అనూరాధను తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్ యూఎస్) నాయకులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ జిల్లాలో విద్య నాణ్యతను మెరుగుపరిచే దిశగా సమగ్ర శిక్ష తరపున అన్ని కార్యక్రమలను సకాలంలో అమలు చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవసరమైన ప్రతి విషయంలో సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని, జిల్లాలో విద్యా పరిశోధనలు, ఆధునిక బోధన పద్ధతులు, పాఠశాలల్లో అవసరాల అందుబాటుపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ఉపాధ్యాయ సంఘాలు ఇచ్చిన మద్దతుకు ధన్యవాదాలు తెలుపుతూ విద్యార్థుల భవిష్యత్తు మా లక్ష్యం- ఉపాధ్యాయుల సహకారమే బలం అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ గంగాధరం, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా కన్వీనర్ వీరాంజనేయులు, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సంజీవరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, ట్రెజరర్ సుధాకర్ నాయక్, కార్యవర్గ సభ్యులు రామచంద్ర, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, సంఘ ప్రతినిధులు ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు

## ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి : మంత్రి మండిపల్లి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి నేతాజీ సర్కిల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజల సమస్యలు విని తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందు బాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని పలువురు కలిసి తమ సమస్యలను వివరించగా వాటిని పరిష్కరించేందుకు మంత్రి హామీ ఇచ్చారు.

## ఉపాధి కూలీల సంఖ్యను పెంచండి: డ్వామా పీడీ



ఉపాధి పనులు తనిఖీ చేస్తున్న పీడీ వెంకటరత్నం

సుండుపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని డ్వామా పీడీ వెంకటరత్నం ఆదేశించారు. మంగళవారం మండలంలోని బలిజపల్లి సమీపంలో ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీలైనన్ని ఎక్కువ పనులను కల్పించడంతోపాటు, రైతులకు ఉపయోగపడేలా చేయించాలని ఆదేశించారు. ఉపాధి కూలీలను పెంచి, అవకతవకలకు చోటివ్వకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. కూలి మొత్తాన్ని పెంచిన విషయాన్ని కూలీలకు తెలియజేయాలన్నారు. అనంతరం హాజరును పరిశీలించారు. స్త్రీశక్తి భవనంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. రికార్డులు పక్కాగా ఉండేలా జాగ్రత్తలు వహించాలన్నారు. ఉపాధి కూలీలతో ఈకేవైసీ పూరి చేయించాలన్నారు. ఈకేవైసీ చేసిన వారికే ఉపాధి పనులు ఉంటాయని, చేయని వారిని తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మాలిక్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

## కాలువకు గండి కొట్టిన వారిపై చర్యలు తీసుకోండి



గండిని పరిశీలిస్తున్న శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వెలిగల్లు ప్రాజెక్టు కుడికాలువకు గండి కొట్టి అక్రమంగా నీటిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం గండి కొట్టిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొంతమంది స్వార్థంతో కాలువకు గండి కొట్టి నీరంతా వృథా చేస్తున్నార న్నారు. ఈ చర్యతో కాలువ వ్యవస్థ దెబ్బతినడమే కాకుండా, సాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికార విభాగాలు వెంటనే దర్యాప్తు చేసి బాధ్యులైన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, వెలిగల్లు ప్రాజెక్టు కాలువ వద్ద భద్రతా చర్యలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ లక్కి రెడ్డిపల్లె మండల అధ్యక్షుడు అవులకుంట నాగార్జున, సీపీఐ పందిళ్లపల్లి గ్రామ నాయకులు నాగేంద్ర, చరణ్, రైతులు పాల్గొన్నారు.

## 'ఉద్గం పోర్టల్‌తో నిరర్థక ఖాతాల్లోని సొమ్ము పొందవచ్చు'

పెనగలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా లావాదేవీలు లేక నిరర్థకంగా మారిన బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును ఉద్గం పోర్టల్ ద్వారా పొందవచ్చునని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ నంబూరు లక్షుమయ్య తెలిపారు. మంగళవారం పెనగలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆశ కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈకేవైసీ, సుకన్య సమృద్ధియోజన, సోషల్ సెక్యూరిటీ స్కీం, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పదేళ్లుగా లావాదేవీ లేని ఖాతాదారులు అకౌంట్‌లోని డబ్బును తిరిగి పొందడానికి రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా ఉద్గం పోర్టల్ ద్వారా అవకాశం కల్పించిందన్నారు. ప్రతి ఖాతాదారు తన అకౌంట్‌కు ఫోన్‌నంబరును కచ్చితంగా జతపరచాల్సి ఉంటుందన్నారు. దీని ద్వారా ఖాతాలోనికి త్వరితగతిన నగదు జమ అవుతుందన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## అరుంధతివాడ సమస్యలు పరిష్కరిస్తాం



సమస్యలను వింటున్న తహసీల్దార్

రైల్వేకోడూరురూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యానాది పల్లె అరుంధతివాడ గ్రామ సమస్యలను పరిష్కరిస్తామని రైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ తెలిపారు. మంగళవారం చియ్యవరం గ్రామ పంచాయతీ పరిధిలోని యానాదిపల్లె అరుంధతివాడను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సీపీఐ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పండుగోల మణి వినతి మేరకు గ్రామాన్ని సందర్శించి సమస్యలను తెలుసుకున్నామని శ్మశాన వాటికి తదితర సమస్యలను ప్రజలు విన్నవించారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## చమర్తిపై విమర్శలు తగవు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

సిద్దవటం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజుపై విమర్శలు చేయడం తగదని టీడీపీ నేతలు హితవు పలికారు. సిద్దవటంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మండల టీడీపీ అధ్యక్షుడు రాజశేఖర్‌యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గ టీడీపీఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజుపై కొంతమంది టీడీపీ నేతలు విమర్శలు చేయడం భావ్యం కాదన్నారు. ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీని భూస్థాపితం చేసి టీడీపీ జెండా ఎగురవేసిన వ్యక్తిపై విమర్శలు చేయడం తగదన్నారు. రాబోవు స్థానిక ఎన్నికల్లో వైసీపీని భూస్థాపితం చేసేందుకు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. రాష్ట్ర పంచాయతి రాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరి కుప్పాల వెంకటసుబ్బయ్య, పాల్గొన్నారు.

## విద్యార్థులు మేధా సంపత్తిని పెంపొందించుకోవాలి



పసుపులేటి శంకర్‌ను సన్మానిస్తున్న 'అన్నమాచార్య' అధ్యాపకులు

రాజంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తమ మేధా సంపత్తిని పెంపొందించుకోవాలని పోతన సాహిత్యపీఠం అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి శంకర్ సూచించారు. స్థానిక అన్నమాచార్య విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాలలో మంగళవారం ఉదయం యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యక్తిత్వ వికాసం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుని అన్నిరంగాల్లో ముందుకు సాగాలన్నారు. చదువుతో పాటు సంస్కారం ఎంతో అవసరమని, క్రమశిక్షణలేని విద్య చుక్కానిలేని నావ వంటిదన్నారు. కడప విశ్రాంత డిప్యూటీ మెడికల్ అధికారి గుణశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. స్టెప్ సీఈవో సుబ్బ రాయుడు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ సమతానాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పసుపులేటి శంకర్‌ను ఘనంగా సత్కరించారు.

## జాతీయ స్థాయికి పెద్దూరు విద్యార్థులు


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వీరబల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్-14 బేస్‌బాల్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన కడప జిల్లా జట్టులోని సి.జగదీశ్ (9వ తరగతి) అనే విద్యార్థి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ పోటీలు నవంబరు 27 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు పలమనేరులో నిర్వహించారు. నవంబరు 27 నుంచి 29 వరకు ఆహోబిలంలో నిర్వహించిన అండర్-17 పోటీల్లో వి.హర్షవర్ధన్ (10వ తరగతి) కూడా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.జయన్న తెలిపారు. ఎంపికైన విద్యార్థులు జనవరిలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో మొత్తం ఐదుగురు విద్యార్థులు జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్, బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయామ సంచాలకుడు జగదీశ్వరయ్యను ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది, పాఠశాల కమిటీ చైర్మన్ నాగేశ్వర అభినందించారు.

## జాతీయ ఖోఖో పోటీలకు గురుకులం విద్యార్థి


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

ఓబులవారిపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సంజీవపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి ఎస్.రాంచరణ్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎన్నికయ్యాడని ప్రిన్సిపాల్ డాక్టర్ మన్సూర్ ఆలీ తెలిపారు. గత వారం అనకాపల్లెలో జరిగిన పోటీల్లో గురుకుల పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు పాల్గొనగా ఒక విద్యార్థి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు.

# హైటెక్ భిక్షాటన

- కారులో తిరుగుతూ... అమాయకులకు బురిడీ...
- అడ్డుకున్న గ్రామస్థులు, పోలీసులకు అప్పగింత


మంచూరు గ్రామం వద్ద మోసగాళ్లను అడ్డుకున్న గ్రామస్థులు

వాల్మీకిపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మోసానికి కాదేది అనర్హం. దేవుడి పేరు ఆపై భిక్షాటనతో మోసాలు..ముందుగా బాగా కనిపించే పెద్ద భవంతులే టార్గెట్. ఆ పై ఆ ప్రాంతాల్లో రెక్కీ అన్నీ అనువుగా కుదిరితే రంగంలోకి కాషాయి వస్త్రాలతో ప్రత్యక్షం. అమాయకులను లక్ష్యంగా చేసుకుని గ్రామాల్లో కారులో తిరుగుతూ డబ్బులు గుంజుతున్న మోసగాళ్లను ప్రజలు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన గోటూరి బ్రహ్మాజి వెంకటరమణ, చెన్నూరి రాజు, ముగ్గు చిన్న పల్లయ్యలు ఏపీ40బీఎస్ 2051 నెంబరు గల కారులో తిరుగుతూ సరికొత్త భిక్షాటన పేరుతో ప్రజలను మభ్య పెట్టి డబ్బు వసూలు చేసేవారు. రెండు రోజులుగా వాల్మీకిపురం పట్టణ పరిసర ప్రాంతాల్లో కారులో తిరిగే ఈ ముగ్గురు వ్యక్తులు ఏకాంత నివాసాలను చూసుకుని అక్కడే తచ్చాడుతూ కనిపించడం నివాసాల వద్ద ఉండే సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. స్థానికంగా ఓ పోలీసు ఇంటి వద్ద కారు నిలిపి భిక్షాటనకు వచ్చామని బెల్లం, బియ్యం తీసుకుని తమ ప్రాంతానికి తీసుకెళ్తుంటామని పలువురిని నమ్మించారు. దీంతో పాటు పరిసర ప్రాంతాలు, కాలనీల సమాచారం అడగడంతో అనుమానం వచ్చిన ప్రజలు అక్కడ గుమికూడటంతో వెంటనే అక్కడి నుంచి ఉడాయించారు. కారులో ఓ వ్యక్తి కాషాయ వస్త్రాలు ధరించి ఉండటం మిగిలిన ఇద్దరూ కారు దిగి నివాసాల వద్దకు వచ్చి గేట్లు కొట్టడం తదితరం చేశారని స్థానికులు చెబుతున్నారు. మండలంలోని మంచూరు గ్రామంలో ఓ నేతను మాటలతో మభ్యపెట్టి నీ బిడ్డ చదువులో సరిగా లేడని మేము చెప్పినట్లు చేస్తే బాగా చదువుతాడని నమ్మించి రూ.5 వేలు తీసుకున్నారు. వారు వెళ్లిపోయిన తర్వాత కానీ డబ్బు వేసిన వ్యక్తి తనకు ఏమైందో తెలియదు కానీ వారు చెప్పినట్లు విని రూ.5 వేలు ఫోన్‌పే చేసినట్లు చెప్పడం గమనార్హం. ఇదే కోవలో మంగళవారం మండలంలోని పెరుమల్లయ్యగారిపల్లెలో వీరి సంచారంతో అనుమానాలు రావడంతో వారిని గ్రామస్థులు అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. అపరిచిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలు మోసపూరిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మోసాలకు పాల్పడే బురిడీ బాబాల విషయాలు నమ్మద్దని అలాంటి వ్యక్తులు కనపడితే తక్షణం పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు.

## అన్నమయ్య కాలిబాటలో తిరుమలకు వెళ్లొద్దు

- జిల్లా అటవీ అధికారి జగన్నాథ్‌సింగ్

రాజంపేట టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కుక్కలదొడ్డి నుంచి అటవీ మార్గంలోని అన్నమయ్య కాలిబాటలో తిరుమలకు వెళ్లరాదని జిల్లా అటవీశాఖ అధికారి జగన్నాథసింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ ప్రాంతంలో ఏనుగుల మందలు, చిరుతపులులు సంచరిస్తుండడంతో ప్రజలకు ప్రవేశాన్ని నిషేధించామన్నారు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని కోరారు.

## రాష్ట్ర స్థాయికి అన్నమయ్య జిల్లా విద్యార్థులు

రాయచోటిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కౌశల్-2025 ప్రతిభా అన్వేషణ పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన అన్నమయ్య జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు కౌశల్ జిల్లా కో-ఆర్డినేటర్ మధుమతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవంబరు 27, 28వ తేదీల్లో జిల్లా స్థాయిలో నిర్వహించిన కౌశల్ సైన్స్ ప్రతిభ అన్వేషణ ఆన్‌లైన్ పరీక్ష పోటీల్లో అన్నమయ్య జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 12 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆమె తెలిపారు. అందులో బి.రెడ్డిప్రసన్న (పెద్దివీడు, రెడ్డివారిపల్లె), కుర్రపోతుల వెన్నెల (బీజీ రాచపల్లి హైస్కూల్), కె.గౌరీప్రియ (గట్టు జడ్పీ హైస్కూల్), ఎం.గోపిక (బోయినపల్లి ఎస్‌జేఎస్‌యం హైస్కూల్), పి.ప్రసన్న (పీలేరు బీసీ వెల్ఫేర్ బాలికల పాఠశాల), ఆవులకుంట హర్షిత (బీపీ రాచపల్లి హైస్కూల్), జి.మణిచందు (పీలేరు బీసీ వెల్ఫేర్ బాలికల పాఠశాల), సౌమ్య (రాజంపేట గర్ల్స్ హైస్కూల్), నాగూరు సుష్మాతాజ్ (మాసాపేట హైస్కూల్), ఎల్.ఆల్మాస్ (కురబలకోట జడ్పీ హైస్కూల్), టి.భవ్యశ్రీ (కలికిరి బీసీ వెల్ఫేర్ బాలికల పాఠశాల), వి.నిఖిత (రాయచోటి బాలికల పాఠశాల) విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆమె వివరించారు.

### రోడ్డు ప్రమాదం కేసులో
## నిందితుడికి రెండేళ్ల జైలు

సిద్దవటం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారిని ద్విచక్రవాహనంతో ఢీకొన్న కేసులో నిందితుడికి రెండేళ్ల జైలుశిక్ష, రూ. 500 జరిమానా విధిస్తూ బద్వేలు న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపిన వివరాల మేరకు... మండలంలోని మిట్టపల్లెకు చెందిన కొమ్మినేని సతీష్ 2018లో భాకరాపేట సమీపంలోని రాజస్థాన్ డాబా వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఏఎస్ఐని ద్విచక్ర వాహనంతో ఢీకొన్నాడు. ఆ ప్రమాదంలో ఏఎస్ఐకి కాలు విరగడంతో అతడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మంగళవారం బద్వేల్ న్యాయస్థానం శిక్ష విధిస్తూ తీర్పునిచ్చిందని ఎస్ఐ వివరించారు.

## 12 మండలాల్లో వరి కొనుగోలు కేంద్రాలు

రాయచోటి(నేతాజీ సర్కిల్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరి నూర్పిళ్లు జరుగుతున్న దృష్ట్యా జిల్లాలోని 12 మండలాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రాల్లో సంబంధిత వీఏఏలను సంప్రదించి ధాన్యాన్ని విక్రయించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

**వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు :** బి.కొత్తకోట, గాలివీడు, కురబలకోట, లక్కిరెడ్డిపల్లె, మదనపల్లె, నిమ్మనపల్లె, పెద్దతిప్పసముద్రం, రామాపురం, రామసముద్రం, తంబళ్లపల్లి, వాల్మీకిపురం, వీరబల్లి మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఈ క్రాప్, ఈకేవైసీతో పాటు తమ పేర్లు నమోదు చేయించుకున్న రైతులు మాత్రమే అర్హులు.

## 256 అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు

రాయచోటి (నేతాజీ సర్కిల్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విజయరామరాజు మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. బదిలీల్లో రిలీవర్ లేకుండా ఆగిపోయిన ఉపాధ్యాయుల కోసం అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామక ఉత్తర్వులను జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి కడప జిల్లాలో 256 పోస్టులు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. ఇందుకు సంబంధించిన జిల్లా విద్యాశాఖ అధికారులకు పలు సూచనలను తెలియజేసినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## పీకేఎం ఉడా ఆధ్వర్యంలో అభివృద్ధి


సివిల్ సప్లైస్ గోడౌన్‌లో సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి

బి.కొత్తకోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పలమనేరు-కుప్పం-మదనపల్లి అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ (పీకేఎం ఉడా) ఆధ్వర్యంలో మదనపల్లి డివిజన్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందుతున్నట్లు మదనపల్లి సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణి తెలిపారు. మంగళవారం మండలంలో ఆమె పర్యటించారు. 25 ఎకరాల స్థలం కావాలన్న పీకేఎం ఉడా అభ్యర్థన మేరకు ప్రభుత్వ స్థలం గుర్తించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు అందాయి. ఈ మేరకు గుమ్మసముద్రం పంచాయతీ పరిధి కొండకిందపల్లి సమీపంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అధికారులు గుర్తించారు. ఈ స్థలాన్ని సబ్‌కలెక్టర్ పరిశీలించారు. బి.కొత్తకోట-మదనపల్లి రహదారికి ఆనుకుని ఉన్న ఈ స్థలంలో నిర్మాణాలకు సానుకూలతలను ఆమె పరిశీలించి, సాధ్యాసాధ్యాలపై అధికారులతో చర్చించారు. అనంతరం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద ఉన్న సివిల్ సప్లైస్ గోడౌన్ వద్దకు చేరుకుని రికార్డులను తనిఖీ చేశారు. బియ్యం, చక్కెర, ఇతర నిత్యావసర వస్తువులు నిల్వలు, సరఫరాలపై ఆరా తీశారు. రికార్డులను సరిగ్గా మెయింటైన్ చేయాలని తూకాలపై ఫిర్యాదులున్నాయని, అక్రమాలకు తావు లేకుండా గోడౌన్ నిర్వహణ ఉండాలని ఇన్‌చార్జిని ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ బావాజాన్, ఆర్ఐ వీరాంజనేయులు, సీయస్ డీటీ సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

# కురవంక సచివాలయంలో ప్రత్యేకాధికారులు

- సస్పెండ్ అయిన కార్యదర్శి నుంచి రికార్డులు స్వాధీనం
- 18 రోజులుగా కార్యదర్శి ఆధీనంలోనే రికార్డులు



రికార్డులు స్వాధీనం చేస్తున్న కార్యదర్శి మంజుల

మదనపల్లె టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కురవంక గ్రామ పంచాయతీ నిర్వహణ నిత్యం వార్తల్లో ఎక్కుతోంది. ఇటు సర్పంచ్‌కు, అటు అధికారులకు మధ్య ప్రచ్ఛన్నయుద్ధం కొనసాగుతోంది. దీనికి తార్కాణమే మంగళవారం కురవంక గ్రామ సచివాలయంలో ప్రత్యేకాధికారులు తనిఖీలు నిర్వహించారు. కురవంక కార్యదర్శిగా పనిచేసిన మంజుల కోళ్లబైలు ఇన్‌చార్జ్ కార్యదర్శిగా కూడా పని చేస్తూ అక్కడ మాన్యువల్‌గా ఇంటిపన్నులు వసూలు చేయడంపై విచారించిన డీపీవో రాధమ్మ, కార్యదర్శి మంజులను గత నెల సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కార్యదర్శి వద్ద ఉన్న పంచాయతీ రికార్డులు ఇంతవరకు ఎవ్వరికి అప్పగించకుండా ఆమె ఆధీనంలోనే ఉంచుకోవడం అధికారుల తనిఖీలో బయటపడింది. వాస్తవంగా ఏదేని పంచాయతీ కార్యదర్శి సస్పెండ్ అయితే మరుసటి రోజునే వేరొక కార్యదర్శికి ఆ పంచాయతీ బాధ్యతలు అప్పగించాలి. కానీ కురవంక పంచాయతీకి తాత్కాలికంగా గిరిధర్‌నాయక్ అనే కార్యదర్శిని వేసినట్లు తెలిసినా ఆయన బాధ్యతలు తీసుకోలేదని సమాచారం. ఈ క్రమంలో ప్రత్యేకాధికారులుగా విచారణకు వచ్చిన నిమ్మనపల్లె ఎంపీడీవో రమేశ్ బాబు, మదనపల్లె డిప్యూటీ ఎంపీడీవో భారతి, సీటీఎం కార్యదర్శి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఇటీవల పనిచేసిన కార్యదర్శి మంజుల నుంచి పంచాయతీ రికార్డులు, క్యాష్‌బుక్, ఎం-బుక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కాగా వీటిని తాత్కాలిక కార్యదర్శి గిరిధర్‌నాయక్‌కు అప్పగించేందుకు చూడగా ఆయన తనకు ఈ బాధ్యతలు వద్దని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీంతో రికార్డులన్నీ తనిఖీకి వచ్చిన అధికారులు ఎంపీడీవో కార్యాలయానికి తరలించారు.

# చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

## బొమన్ సాబ్ లుక్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాజాసాబ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. జనవరి 9న విడుదలవుతోంది. ఈ చిత్రంలో అతీంద్రియ శక్తుల పరిశోధకుడిగా బాలీవుడ్ నటుడు బొమన్ ఇరానీ కీలక పాత్ర పోషిస్తున్నారు. మంగళవారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్‌గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'రాజా సాబ్'ను రూపొందిస్తున్నారు దర్శకుడు మారుతి. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటిస్తున్నారు.



## కథను మలుపుతిప్పే పాత్ర పోషించాను



- సంయుక్త

'అఖండ 2: తాండవం' చిత్రంలో అవకాశం వచ్చినప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఒక మంచి సినిమాలో అవకాశం వస్తే తిరస్కరించకూడదు అని భావించి డేట్స్ అడ్జెస్ట్ చేసుకొని నటించాను. ఈ సినిమాలో కథను మలుపు తిప్పే పాత్ర పోషించాను' అని సంయుక్త అన్నారు. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అఖండ 2: తాండవం'. నందమూరి తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కథానాయిక సంయుక్త సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- "అఖండ 2: తాండవం' చిత్రం 'అంచనాలకు మించి ఉండబోతోంది. బోయపాటి గారు గ్రేట్ విజన్‌తో తెరకెక్కించారు. విజువల్స్ అద్భుతంగా ఉంటాయి.
- ఈ చిత్రంలో నా పాత్ర చాలా కీలకంగా, స్టైలిష్‌గా ఉంటుంది. నా కెరీర్‌లో తొలిసారి ఓ మాస్ సాంగ్ చేశాను. ఇలాంటి మాస్ సాంగ్ ఇప్పటివరకూ చేయలేదు. చాలా కష్టపడ్డాను. ప్రాక్టీస్ చేసే సమయంలో మోకాలు దెబ్బతిని సహకరించకపోవడంతో ఫిజియోథెరపీ చేయించుకున్నా.
- బాలకృష్ణ గారు దర్శకుల నటుడు. వారు ఎలా చెబితే అలా చేస్తారు. నటుడిగానూ ఆయన విజన్ అద్భుతం. సెట్‌లో ఆయన చాలా స్నేహంగా ఉండేవారు. ఆయన నటించిన 'డాకూ మహరాజ్' నా ఫేవరేట్ చిత్రం.
- తమన్ సంగీతం, ముఖ్యంగా సంస్కృత శ్లోకాలతో సాగే నేపథ్య సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది. మా నిర్మాతలు రామ్, గోపీ గారు మేకింగ్‌లో రాజీ పడలేదు. సినిమాను ప్రేక్షకులకు చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కథానాయికగా స్వయంభు, నారీ నారీ నడుమ మురారి చిత్రాలు చేస్తున్నాను.

## అఖండ 2
## టికెట్ ధరల పెంపు
### - ఏపీ ప్రభుత్వ అనుమతి

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండ 2' సినిమా టికెట్ ధరల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం అనుమతిచ్చింది. ఈ నెల 5న ఈ చిత్రం విడుదలవుతోంది. నిర్మాతల వినతి మేరకు భారీ బడ్జెట్ సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి జారీ చేస్తోంది. అందులో భాగంగానే ఈ సినిమా విడుదలైన తొలి పది రోజులు టికెట్ ధరలు పెంచుకునేందుకు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు పూర్తి అనుమతి లభించింది. సింగిల్ స్ర్కీన్లలో సాధారణ రేటుపై రూ. 75, మల్టీప్లెక్స్‌ల్లో రూ. 100 పెంపునకు అనుమతించింది. ఈ నెల నాలుగున ప్రదర్శించే ప్రీమియర్ షో టికెట్ ధర రూ. 600గా నిర్ణయించారు.

## విందు భోజనంలా ఎంజాయ్ చేసే సినిమా



క్రికెట్ క్రీడ నేపథ్యంలో కామెడీ ప్రధానాంశంగా రూపుదిద్దుకున్న చిత్రం 'గేట్'. సుడిగాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటించారు. ఎం. చంద్రశేఖర్ నిర్మించారు. మంగళవారం నిర్మాత దిల్‌రాజు టీజర్‌ను విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 'అడ్డంకులను దాటుకొని ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దాం. మంచి అభిరుచితో చేసిన సినిమా ఇది. ప్రేక్షకులు విందు భోజనంలా ఎంజాయ్ చేస్తారు. మణిశర్మ నేపథ్య సంగీతం సినీ ప్రియులను మెప్పిస్తుంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు. సహ నిర్మాత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాను మాస్ ఎంటర్‌టైనర్‌గా తీశాం. చంద్రశేఖర్ రెడ్డి ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు' అని తెలిపారు. ఆద్యంతం వినోదం పంచే చిత్రమిదని దివ్యభారతి తెలిపారు.

## యువతకు కనెక్ట్ అయ్యే కథ



రివేంజ్ స్టోరీతో సాగే థ్రిల్లింగ్ ప్రేమకథా చిత్రం 'సైక్ సిద్ధార్థ్'. శ్రీనందు, యామిని భాస్కర్ జంటగా నటించారు. వరుణ్‌రెడ్డి దర్శకత్వంలో శ్రీనందు, శ్యామ్ సుందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా శ్రీనందు మాట్లాడుతూ 'ఇప్పుడున్న సమాజానికి, యువతకు కనెక్ట్ అయ్యే కథతో తెరకెక్కిన చిత్రమిది. సురేశ్‌బాబు గారు సినిమా చూసిన వెంటనే పంపిణీ చేసేందుకు అంగీకరించారు. సురేశ్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను తీసుకోవడంతో నా కల నెరవేరినట్లయింది' అని చెప్పారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రచార చిత్రాలకు చక్కని ప్రేక్షకాదరణ దక్కింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా స్క్రీన్‌ప్లేలో చాలా మార్పులు చేశాం' అని చెప్పారు.

## అనుమాన పక్షి
## వచ్చేది అప్పుడే




రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ జంటగా 'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'అనుమాన పక్షి'. చిలక ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలక, రాజేశ్ జగ్తియాని, హీరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. తాజాగా సినిమా విడుదల తేదీని వెల్లడిస్తూ ఓ వీడియోను షేర్ చేశారు మేకర్స్. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. వినోద ప్రధానంగా సాగే ఈ సినిమా విమల్ కృష్ణ మార్క్‌తో స్టైలిష్‌గా ఉండనుందని చెప్పారు. రాగ్ మయూర్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. అతిగా ఆలోచిస్తూ, అతి జాగ్రత్తతో ఉండే ఆయన రోల్ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాక, కడుపుబ్బా నవ్విస్తుందని మేకర్స్ అన్నారు. బ్రహ్మాజీ, ప్రిన్స్ సెసిల్, అనన్య, చరిత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: సునీల్‌కుమార్ నామా, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

## ప్రేమ కోసం యుద్ధం



రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా 'కలర్ ఫొటో' ఫేమ్ సందీప్ రాజ్ తెరకెక్కించిన చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతోంది. మంగళవారం చిత్రం ట్రైలర్‌ను హీరోయిన్ రష్మిక మందన్న విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్‌లో పాత్రలను, కథా నేపథ్యాన్ని పరిచయం చేసిన విధానం ఆకట్టుకుంది. 'తన ప్రేమ కోసం యుద్ధం చేసే ప్రతీవాడు హీరోనే' అంటూ కథానాయకుడు పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. బండి సరోజ్‌కుమార్ ఈ సినిమాలో విలన్‌గా నటించారు. హర్ష చెముడు కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: రామ మారుతి ఎమ్, సంగీతం: కాలభైరవ.

## కాంతారపై కామెడీ
### రణ్‌వీర్ క్షమాపణలు



కాంతార చిత్రంపై తాను చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ మంగళవారం క్షమాపణలు చెప్పారు. ఎవరినీ కించపరచడం తన ఉద్దేశం కాదని తెలిపారు. 'రిషబ్ శెట్టి బాగా నటించారని చెప్పడం కోసమే నేను అలా నటించాను. అలాంటి సన్నివేశాల్లో నటించాలంటే చాలా కష్టం. అయినా ఏ ఇబ్బంది లేకుండా అటువంటి సన్నివేశాలను ఎంతో ఈజ్‌తో చేసే ఆయనంటే నాకు చాలా ఇష్టం. మన దేశంలోని ప్రతీ సంప్రదాయం మీద నాకు అపారమైన గౌరవం ఉంది. నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించండి' అని పేర్కొన్నారు. 'కాంతార'పై రణ్‌వీర్ చేసిన వ్యాఖ్యలపై హిందూ జనజాగృతి సమితి ఫిర్యాదు చేసింది. ఆయన చేసిన కామెంట్స్ హిందువుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని పేర్కొంది. గోవాలో ఇటీవలె ముగిసిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) వేడుకల్లో రణ్‌వీర్ 'కాంతార' చిత్రంపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. వేదికపై మాట్లాడుతూ "కాంతార సినిమాలో రిషబ్ శెట్టి నటన అద్భుతం. హీరో పాత్రలోకి దెయ్యం ప్రవేశించినప్పుడు వచ్చే సన్నివేశాలు చాలా బాగున్నాయి" అని రణ్‌వీర్ పేర్కొన్నారు. ఆ సినిమాలో ఎంతో పాపులర్‌గా మారిన 'ఓ' అనే శబ్దాన్ని స్టేజీపై అనుకరించారు. దేవతను ఆయన దెయ్యంగా పోల్చాడని కర్ణాటక వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు.

## వినూత్నంగా వన్ బై ఫోర్



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో తెరకెక్కిన కామెడీ థ్రిల్లర్ 'వన్ బై ఫోర్'. వెంకటేశ్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్ జంటగా నటించారు. బాహుబలి పళని కె. దర్శకత్వంలో రంజన రాజేశ్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది.

ఈ సందర్భంగా వెంకటేశ్ పెద్దపాలెం మాట్లాడుతూ 'కొత్త తరహా కథాంశంతో ఈ క్రైమ్ డ్రామాను తీశాం. పళని గారి టేకింగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణ. 'హారర్, సస్పెన్స్ అంశాలు, పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్ అంశాలతో పాటు మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిది. పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్ అని చెప్పారు. కథ మీద నమ్మకంతో ఈ చిత్రాన్ని నిర్మించాం, ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది అని నిర్మాతలు తెలిపారు.

## విడుదలకు సిద్ధం



భాస్కర్, కోటేశ్వర రావు ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'విధాత'. మణికంఠ రాజేంద్రబాబు దర్శకత్వంలో అప్పిని పల్లె భాస్కర చారి నిర్మించారు. విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మణికంఠ రాజేంద్రబాబు మాట్లాడుతూ 'ఇదో వైవిధ్యభరితమైన చిత్రం. పాత్రలన్నీ సహజ సిద్ధంగా ఉంటాయి' అని అన్నారు. 'ఓ యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాము' అని అప్పిని పల్లె భాస్కర చారి తెలిపారు.

# ఆక్రమణలో కోనేటిగుంత

- ఏళ్ల తరబడి గుంతను పూడ్చక...
- సర్వే చేయక నిరుపయోగంగా..
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

చెన్నూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రభారతిపేటలోని కోనేటి గుంత రోగాలకు ఆక్రమణకు గురవుతోంది. చాలా ఏళ్లక్రితం ఈ గుంతలోని నీరు వ్యవసాయ పొలాలకు ఉపయోగపడేది. ఇదే ప్రాంతం పైభాగంలో ఉన్న రుద్రభారతిపేట చెరువు నుంచి నీరు వచ్చి కోనేటి గుంతకి చేరి.. అక్కడ నుంచి చిన్నమాచుపల్లె వ్యవసాయ పొలాలకు కాల్వల



కోనేటి గుంత స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు

**విలువ రూ2కోట్లు పైనే...**

రుద్రభారతి కోనేటి గుంతకు చుట్టూ ఉన్న స్థలం విలువ ప్రైవేటు మార్కెట్‌లో సెంటు రూ.3లక్షలు పైమాటే పలుకుతుంది. దీంతో ఈ స్థలం విలువ రూ.2 కోట్లు ఉంటుంది. సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి ఆ కోనేటి గుంత స్థలానికి కొలతలు వేసి ఫెన్సింగ్ వేయడమా, లేక గుంత పూడ్చి ప్రజలకు ఇంటిపట్టాలు ఇవ్వడమా చేయాలని కోరుతున్నారు.

ద్వారా ఉపయోగపడేది. ఈక్రమంలో రుద్రభారతి పేట ప్రాంతంలో ప్రభుత్వం కొందరికి ఇంటిస్థలాలు కేటాయించింది. దీంతో 2002 నుంచి ఈ ప్రాంతంలో ఇంటి నిర్మాణాలు జరిగాయి. అయితే ఆ కోనేటి గుంత ( సర్వే నెం.138లో 75 సెంట్లుపైగా) లోతు ఎక్కువగా ఉందని దాన్ని వదిలేశారు. అయితే నాటి నుంచి నేటి వరకు గుంతలో నీరు వ్యవసాయ పొలాలకు వెళ్లే మార్గం లేక నిరుపయోగంగా మారింది. దీంతో కోనేటిలో పంట కాల్వ వ్యర్థాలు పడి దోమలకు నిలయంగా మారింది. దీంతో చీకటి పడితే దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని ఆప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కబ్జారాయుళ్ల కన్ను...**

ప్రభుత్వం 2006 నుంచి ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టడంతో పలు చోట్ల గుంతలను పూడ్చడం జరుగుతోంది. అదే విధంగా రుద్రభారతిపేట కోనేటి గుంతను కూడా పూడ్చిస్తే ప్రజలకు



రుద్రభారతిపేటలో నిరుపయోగంగా ఉన్న కోనేటి గుంత

ఉపయోగపడుతుందని పలువురు అంటున్నారు. చాలా కాలంగా రోడ్డు పక్కనే ఈ గుంత ఉండడంతో కొంతమంది కబ్జాదారుల కన్ను దీనిపై పడింది. గతంలో కోనేటి గుంత విస్తీర్ణం ఎక్కువగా ఉండేది. ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఇంటి ప్లాట్లు కేటాయించడంతో కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. దీంతో కోనేటి గుంత చుట్టూ ఉన్న స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. కోనేటి గుంత స్థలం కబ్జాకు గురవుతోందని.. సర్వే చేసి చుట్టూ ఫెన్సింగ్ వేయాలని చాల మంది రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇంత వరకు ఆ గుంతను సర్వే చేసిన పాపానపోలేదు. దాదాపు 22 ఏళ్లుగా పట్టించుకునేవారే లేరు. దీంతో ఈ స్థలం మాదంటూ పోర్జరీ పట్టాలు తయారు చేసుకుని ఆక్రమించారు. ఇక కొందరు గుంత స్థలం మాది, మా పూర్వీకులది అంటూ తప్పుడు డాక్యుమెంట్లు చూపిస్తూ ఆక్రమించే ప్రయత్నం చేయడంతో ఇటీవల రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. కాగా, ఈ విషయమై తహసీల్దార్ సరస్వతిని వివరణ కోరగా.. కోనేటి గుంత విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

## వసంతపేట పాఠశాలలో త్రీమెన్ కమిటీ విచారణ



విద్యార్థులను విచారిస్తున్న త్రీమెన్ కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరుటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక వసంతపేట మున్సిపల్ హైస్కూలులో నవంబరు 28వ తేదీ మధ్యాహ్న భోజనం ఫుడ్‌పాయిజన్ కావడంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటనపై ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తూ త్రీమెన్ కమిటీని నియమించింది. కమిటీ సభ్యులు కడప డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి, ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ హరిత, తహసీల్దారు గంగయ్య మంగళవారం ఆస్పత్రిలో చికిత్స పొందిన విద్యార్థులను విచారించి సంఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ఏం జరిగిందో లిఖితపూర్వకంగా రాసి ఇవ్వాలన్నారు. ఆరోజు మధ్యాహ్న భోజనం రుచి చూసిన ఉపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులను విచారించారు. అనంతరం పాఠశాలలో ఉన్న వంటగదిని పరిశీలించారు. బాత్‌రూం పక్కన ఉన్న వంట గదిని మరోచోటికి మార్చాలని సూచించారు. స్టోర్ రూంను పరిశీలించి గాలి, వెలుతురు ఉండేలా ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయుడు గురప్పను ఆదేశించారు. ఈ విచారణకు వంట ఏజెన్సీ నిర్వాహకులు అందుబాటులోకి రాలేదని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం ఫుడ్‌పాయిజన్‌పై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని డిప్యూటీ డీఈఓ తెలిపారు.

## ప్రాణహాని ఉందంటూ యువతి ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న శ్రావణి

పీలేరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తనను నమ్మించి మోసం చేయడమే కాక చంపేస్తానని బెదిరిస్తున్నాడంటూ ఓ యువతి కేవీపల్లె పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. మారెళ్ల పంచాయతీ నల్లకమ్మిరెడ్డిగారిపల్లె వాసి శ్రావణి, అదే గ్రామానికి చెందిన నందకుమార్ రెడ్డిపై ఫిర్యాదు చేసింది. శ్రావణి కథనం మేరకు... నందకుమార్ రెడ్డికి గతంలో రెండు పెళ్లిళ్లు అయినా తనను ప్రేమ పేరుతో మోసం చేసి మూడో పెళ్లి చేసుకున్నాడన్నారు. పెళ్లి అయిన వారం రోజుల తరువాత అతడి నిజస్వరూపం బయటపడిందన్నారు. గతంలో జరిగిన పెళ్లిళ్ల గురించి తెలుసుకుని ప్రశ్నించిన తనను రోజూ మద్యం తాగి హింసించేవాడని, ఆ హింస భరించలేక తాను తిరిగి తల్లిదండ్రుల చెంతకు చేరానన్నారు. అయితే అతను తనకు ఫోను చేసి చంపేస్తానంటూ బెదిరిస్తున్నాడని, అతడి బారి నుంచి తనను కాపాడాలని ఆమె పోలీసులను కోరింది. ఆమె ఫిర్యాదు మేరకు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని కేవీపల్లె పోలీసులు తెలిపారు.

## నాణ్యతతో, రుచికరంగా భోజనం అందించాలి

- సెంట్రలైజ్డ్ స్మార్ట్‌కిచెన్ల తనిఖీలో కలెక్టర్



జమ్మలమడుగు పీఆర్ హైస్కూలులో భోజనం పరిశీలిస్తున్న కలెక్టర్

జమ్మలమడుగు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని.. విద్యార్థులకు నాణ్యతతో రుచికరమైన భోజనం అందించాలని వంట ఏజెన్సీలకు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సూచించారు. జమ్మలమడుగు నియోజకవర్గ పర్యటనలో భాగంగా దేవగుడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్మార్ట్‌కిచెన్ నిర్వహణ తీరును పరిశీలించి.. అక్కడున్న వంట ఏజెన్సీ సిబ్బందితో మాట్లాడారు. రోజువారి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం జమ్మలమడుగు పట్టణంలోని పతంగే రామన్నరావు జిల్లా పరిషత్ హైస్కూలులో స్మార్ట్‌కిచెన్‌ను పరిశీలించి వంట నిర్వహణ ఏజెన్సీలతో మాట్లాడారు. అన్నం, చెట్నీ రుచి చూసిన కలెక్టర్ మరింత నాణ్యతగా అందించాలని సూచించారు. రాష్ట్రానికే ఆదర్శంగా జిల్లాలో నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్‌కిచెన్లను జిల్లాలోని అన్ని మండలాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దారు శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ పీడీ రాజారత్నం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి



జమ్మలమడుగు సబ్ డివిజనల్ పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ నచికేత్ విశ్వనాధ్ అన్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లు, గతంలో ఎన్నికల నేరాలకు పాల్పడిన వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జమ్మలమడుగు సబ్ డివిజన్ పోలీసు అధికారులతో నేర సమీక్షలో ఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. బాలికలు, మహిళల వేధింపులపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామసభలు, పల్లెనిద్ర, గ్రామాల సందర్శన తప్పని సరిగా నిర్వహించాలన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా గంజాయి, ఇతర మత్తుపదార్థాలు, బహిరంగ మద్యపానం చేసేవారిపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లు, గతంలో నేరాలకు పాల్పడిన వారి కదలికలపై దృష్టి పెట్టాలన్నారు. శక్తిటీంలు పనితీరు మెరుగుపరచుకోవాలన్నారు. సమావేశంలో అడిషన్ ఎస్పీ కె.ప్రకాశ్‌బాబు, జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సబ్ డివిజనులోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## సెర్ప్ అధికారుల పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న సెర్ప్ ఎస్‌పీఎం మూర్తి

మదనపల్లె టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ప్రాంతంలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడం, గిట్టుబాటు ధరలు లేనప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై సెర్ప్ అధికారులు మండలంలో పర్యటించి మహిళా సంఘాల సభ్యుల అభిప్రాయాలు తీసుకున్నారు. మంగళవారం అంకిశెట్టిపల్లె, బొమ్మనచెరువు, మాలేపాడు, పెంచుపాడు గ్రామాల్లో పర్యటించారు. సెర్ప్ ఎస్‌పీఎం ఎస్ఎస్ఆర్ మూర్తి ఆధ్వర్యంలో టమోటా పంట సాగు, గిట్టుబాటు ధరలు లేనప్పుడు ప్రభుత్వం తీసుకునే చర్యలు, టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు అవసరమైన చర్యల గురించి అభిప్రాయాలు తెలుసుకున్నారు. మహిళా రైతులు మాట్లాడుతూ టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్వహణపై తమకు అవగాహన లేదని, మిషనరీ, యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తే ఔత్సాహికులు ముందుకు వస్తారన్నారు. దీంతో పాటు టమోటా క్రేట్లు, గ్రేడింగ్ మిషన్లు అత్యవసరంగా సబ్సిడీపై ఇవ్వాలని అధికారులను కోరారు. ఎస్‌పీఎం మాట్లాడుతూ రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో అపిట్కో కన్సల్టెంట్ బాలకృష్ణరాజు, డీపీఎం నాగార్జున, ఏపీఎం ఖిజర్‌ఖాన్, శ్రీలక్ష్మి, సీసీ లక్ష్మీదేవి, శివారెడ్డి, మహిళ రైతులు పాల్గొన్నారు.

## డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ అండర్ 14 ఇంటర్ జోనల్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. వివరాలిలా..

### కేఎస్ఆర్ఎం మైదానంలో

నగర శివారు ప్రాంత కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో నార్త్‌జోన్ విన్నర్స్ - సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు 90 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 272 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్ విన్నర్స్ తన మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి పరుగుల ఖాతా తెరవలేదు. ఓవర్ నైట్ స్కోరు జీరో పరుగులతో తిరిగి రెండోరోజు బ్యాటింగ్ దిగిన సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టు 90 ఓవర్లలో ఆట ముగిసే సమయానికి ఐదు వికెట్లు కోల్పోయి 291 పరుగులు చేసింది. ఇందులో తమన్ సాయి 111 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. అలాగే రితీష్ 58 పరుగులు చేశాడు. దీంతో సెంట్రల్ జోన్ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 20 పరుగుల ఆధిక్యత సాధించింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

### కేఓఆర్ఎం మైదానంలో

నగర శివారు ప్రాంత కేఓఆర్ఎం మైదానంలో సౌత్‌జోన్ - రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసి రెస్ట్‌ఆఫ్ సౌత్ జోన్ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 69.5 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్ దిగిన రెస్ట్‌ఆఫ్ నార్త్ జోన్ జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 21 ఓవర్లలో తన మొదటి ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు కోల్పోయి 62 పరుగులు చేసింది. ఓవర్ నైట్ స్కోరు 62 పరుగులతో రెండోరోజు అయిన మంగళవారం తిరిగి బ్యాటింగ్ చేపట్టిన రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్ జట్టు ఎట్టకేలకు 63.5 ఓవర్లలో 197 పరుగులు చేసి ఆలౌట్ అయింది. కాగా బౌలింగ్ విభాగంలో రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ బౌలరు రోహిత్ ఆరు వికెట్లు పడగొట్టడం విశేషం. కాగా మొదటి ఇన్నింగ్స్‌లో రెస్ట్‌ఆఫ్ సౌత్ జోన్ జట్టుకు 16 పరుగుల ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు బ్యాటింగ్ దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 97 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 158 పరుగులు చేసింది. ఇందులో హేమచందర్ నాయక్ 70 పరుగులు చేశాడు. దీంతో మ్యాచ్‌ను డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.



తమన్‌సాయి (సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు) - రాజ్ (129 పరుగులు)

### ఏసీఏ క్రికెట్ మైదానంలో

నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో వెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ - సౌత్‌జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 72 ఓవర్లకు 8 వికెట్లు కోల్పోయి 190 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో మహ్మద్ ఇజాహర్ 89 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. కాగా ఓవర్ నైట్ స్కోరు 190 పరుగులతో రెండో రోజు మంగళవారం తిరిగి బ్యాటింగ్ చేపట్టిన సౌత్ జోన్ విన్నర్స్ జట్టు ఎట్టకేలకు 76 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 193 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో మహ్మద్ ఇజహర్ 91 పరుగులతో అవుట్ అయి సెంచరీ మిస్ చేసుకున్నాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్‌కు బ్యాటింగ్ దిగిన రెస్ట్‌ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 78 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 303 పరుగులు చేసింది. ఇందులో రాజ్ 129 పరుగులు, వర్మ 56 పరుగులు చేశారు. కాగా రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 110 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

## వేతనాలు లేవు..కనికరం చూపండి



ఆందోళన చేస్తున్న కురవంక పారిశుధ్య కార్మికులు

మదనపల్లె టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా వేతనాలు ఇవ్వలేదు.. మాపై అధికారులు కనికరం చూపాలని కురవంక పంచాయతీ పారిశుధ్య కార్మికులు, వాటర్‌మెన్‌లు ఆందోళనకు దిగారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద కార్మికులు మాట్లాడుతూ రెండు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, దీంతో జీవనం గడవక అప్పులు పాలవుతున్నామన్నారు. సమస్యపై సర్పంచ్‌ను అడిగితే పంచాయతీ కార్యదర్శి బిల్లులు పెట్టాలని చెబుతున్నాడన్నారు. కార్యదర్శి కోసం చూస్తే ఆమె సస్పెండ్ అయిన తరువాత ఇక్కడ ఎవరినీ నియమించలేదని తెలిసిందన్నారు. గత్యంతరం లేక ఎంపీడీఓ తాజ్‌మస్రూర్‌కు వినతిపత్రం ఇచ్చామన్నారు. ఇప్పటికైనా మాకు వేతనాలు వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని కార్మికులు కోరారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



గాయపడిన రమణారెడ్డి

ములకలచెరువు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని ట్రాక్టరు ఢీకొనడంతో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన రమణారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు... శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం ఈతోడు వాసులు రమణారెడ్డి, శంకర పనినిమిత్తం ములకలచెరువుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. షాదీమహాల్ సమీపంలో ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో రమణారెడ్డి తీవ్రంగా, శంకర స్వల్పంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ రమణారెడ్డిని చికిత్స నిమిత్తం 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు.

## చౌక నిల్వల్లో తేడాలు లేకుండా చూడాలి : సబ్ కలెక్టర్



రీసర్వేపై సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి

కలికిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చౌక దుకాణాలకు సరఫరా అయ్యే నిత్యావసర సరుకుల నిల్వల్లో తేడాలు లేకుండా జాగ్రత్త తీసుకోవాలని మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి సూచించారు. పంపిణీకి, స్టాకు రిజిస్టరుకు మధ్య లెక్కలు సరిపోవాలని స్పష్టం చేశారు. మంగళవారం ఆమె మండలంలోని స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేశారు. లెక్కల ప్రకారం నిల్వలు సరిపోవడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం 6వ నెంబరు చౌకదుకాణంలో పంపిణీని పరిశీలించారు. కార్డుదారుల నుంచి వసూలు చేస్తున్న ధరల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మర్రికుంటపల్లెలో జరుగుతున్న రీసర్వే పనులను పరిశీలించారు. ఈనెల 16లోగా క్షేత్రస్థాయి పనులను పూర్తి చేయాలని సర్వేయర్లను ఆదేశించారు. రైతుల నుంచి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పర్యటనలో తహసీల్దారు హరికుమార్, మండల సర్వేయర్ రెడ్డెప్ప, సీఎస్‌డీటీ విజయకుమార్ రెడ్డి, వీఆర్వో సురేష్ రెడ్డి, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

## భూ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు : ఆర్డీఓ

కలసపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలుతప్పవని బద్వేల్ ఆర్డీఓ చంద్రమోహన్ హెచ్చరించారు. మంగళవారం ఆయన కలసపాడు మండలంలో పర్యటించారు. బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన రైతు వెంకటరమణ ఆత్మహత్యపై స్థానికులు, పోలీసులు, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బందితో కలిసి విచారణ జరిపారు. కలసపాడులోని సర్వేనెంబర్ 240లోని స్థలాన్ని పరిశీలించారు. రెండు రోజుల పాటు జరిగే గుడి తిరుణాళ్ల ఏర్పాట్లను పరిశీలించారు. తహసీల్దారు కార్యాలయంలో చెన్నుపల్లె భూములపై చర్చించారు. ఇటీవల ఆక్రమణలకు గురవుతున్న శంఖవరం రెవిన్యూపరిధిలోని 2707 సర్వే నెంబర్ భూములను ఆయన పరిశీలించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట పోరుమామిళ్ల సీఐ హేమసుందర్, తహసీల్దార్ మధురవాణి, వ్యవసాయ శాఖ అధికారులు, ఫారెస్ట్ సిబ్బంది, డీటీ మోహన్‌రాజు, ఆర్ఐ సింధూజ, ఎస్ఐ తిమోతి తదితరులు ఉన్నారు.

## అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు



మైనార్టీ నేతలతో మాట్లాడుతన్న పోలీసులు

చెన్నూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలో ఎటువంటి నిర్మాణాలైన అనుమతి లేకుండా చేపడితే చట్టపర చర్యలు తప్పవని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. చెన్నూరు ఖిల్లా మసీదు ఆవరణలో కొద్దిరోజులుగా రూముల నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై గతంలో ఇక్కడ పంచాయతీ అనుమతులు లేవని నోటీసులు ఇచ్చి నిలిపి వేశారు. ఈ విషయమై కొద్దినెలలుగా అటు పంచాయతీ, ఇటు పోలీసులు, మైనార్టీ నేతల మధ్య చర్చలు జరుగుతున్నాయి. అయితే మంగళవారం తిరిగి అదే గదులకు పైకప్పు వేసేందుకు మైనార్టీ నేతలు ప్రయత్నించారు. ఈ విషయం పంచాయతీ అధికారులకు తెలియడంతో వారు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డీఎస్పీ ఆదేశాల మేరకు సీఐ క్రిష్టారెడ్డి, కమలాపురం సీఐ రోషన్, కడప, సీకేదిన్నె, వల్లూరు ఎస్ఐలు తులసినాగ ప్రసాద్, శ్రీనివాసులరెడ్డి, పెద్ద ఓబన్న మసీదు వద్దకు వచ్చి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. దీంతో మైనార్టీ నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మసీదు స్థలంలో కట్టుకోవడానికి తమకు హక్కు ఉందని, దీంట్లో ఎవరి ప్రమేయం అవసరం లేదన్నారు. ఇందుకు పోలీసులు ఇప్పటికే ఈ పంచాయతీ కలెక్టరు, ఎస్పీ దృష్టిలో ఉందని, ఆర్డీఓ అనుమతి తీసుకున్న తరువాతే నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఒక దశలో ఈ విషయం కాస్త శ్రుతి మీరడంతో పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, ఇష్టానుసారం నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పంచాయతీ సిబ్బంది నిర్మాణాలు చేపడుతున్న గదులకు నోటీసులు అంటించారు. అనుమతి ఉంటేనే నిర్మాణాలు చేపట్టాలంటూ నోటీసుల్లో పేర్కొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో ఘనవిజయం సాధించాలి



పత్తేపురంలో బూత్‌కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్లు శ్రీనివాసులు నాయుడు, కోసూరి చంద్రమౌళి

వాల్మీకిపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని అన్ని స్థానాల్లో టీడీపీ ఘనవిజయం సాధించడానికి పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని సోమల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం వాల్మీకిపురం మార్కెట్ కమిటీ చైర్మన్ కోసూరి చంద్రమౌళి, మండల టీడీపీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డితో కలిసి పత్తేపురం ఎన్నికల బూత్‌కమిటీ సభ్యులు, పార్టీ నేతలతో గత ఎన్నికల ఫలితాలపై సమీక్షించిన ఆయన మాట్లాడుతూ పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని, సంక్షేమపథకాలు రాజకీయాలకు అతీతంగా అందిస్తున్నారని గుర్తుచేశారు. టీడీపీ శ్రేణులు బూత్‌లోని ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్ సహకారంతో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి గురించి ప్రజలకు వివరించి వైసీపీ మాటలకు మోసపోకుండా చైతన్యం తీసుకువచ్చి పోలింగ్ బూత్‌లో టీడీపీకి మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో టీడీపీ నేతలు పత్తేపురం వెంకటరమణారెడ్డి, ఓబులంపల్లె ఆనందరెడ్డి, శ్రీనివాసులు, పీవీ.నారాయణ, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

## గిట్టల పుండ్లపై జాగ్రత్త వహించాలి

నిమ్మనపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ కారణంగా మండలంలోని పాడి రైతులు ఆవులకు అధిక తేమ వలన వచ్చే గిట్టల పుండ్లపై జాగ్రత్త వహించాలని పశువైద్యాధికారి సురేష్ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అధిక వర్షం కురుస్తుండడంతో పాడి ఆవులను ఒకే చోట కట్టేయకుండా మార్చి కట్టేయాలన్నారు. గొడ్ల చావిడిలో కట్టేయడంతో తేమ ఏర్పడి గిట్టలను పుండ్లు ఏర్పడే అవకాశం వుందన్నారు. అవకాశం వుంటే మిద్దెలలో, బండలు వేసిన చోట కట్టేయాలని సూచించారు. పుండ్లు ఏర్పడితే పాడి ఆవులకు నొప్పులు అధికంగా వుండడంతో ఆహారం తీసుకోక పాల దిగుబడి కూడా తగ్గుతుందన్నారు. దీనిని నివారించేందుకు పుండ్లు వున్న చోట వేడి నీటితో శుభ్రంగా కడిగి పోటాషియం పర్మాంగనేట్‌తో శభ్రం చేయాలన్నారు. అనంతరం దగ్గరలో వున్న పశువైద్యశాలకు తీసుకురావాలని తెలిపారు.






రెండు స్తంభాల దూరంలో ఆగిన

# నిరంతర విద్యుత్తు సరఫరా

ప్రతిపాదనకే పరిమితమైన వైనం

టెక్నికల్ పనులు పూర్తి చేస్తే సరఫరా సాధ్యమే...



పెద్దమండ్యం, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం-తంబళ్లపల్లె సరిహద్దులో రెండు విద్యుత్తు స్థంభాల దూరంలో నిరంతర విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని పలువురు మండల వాసులు వాపోతున్నారు. ఇది ముమ్మాటికీ అధికారుల నిర్లక్ష్యమేనని వివరిస్తున్నారు. పెద్దమండ్యం మండలానికి నిరంతర విద్యుత్తు సరఫరా ట్రాన్స్‌కో అధికారుల ప్రతిపాదనకే పరిమితమైందని చెప్పవచ్చు. వివరాల్లోకెళితే....

పెద్దమండ్యం మండలానికి నిరంతర విద్యుత్తు సరఫరాకు ముసలికుంట సబ్‌స్టేషన్ కేంద్రబిందువుగా మారింది. ముసలికుంట ప్రాంతంలో లోవోల్టేజీ తీర్చడానికి గ్రామ సమీపంలో నూతన విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్మించి ట్రాన్స్‌కో అధికారులు ప్రారంభించారు. దీంతో ముసలికుంట సహా బండ్రేవు, దిగువపల్లి మందలవారిపల్లి ప్రాంతంలో లోవోల్టేజి సమస్య తీరింది. ఈ సబ్‌స్టేషన్ ముసలికుంట ప్రాంతాన్నే కాకుండా మండలానికి కూడా నిరంతర విద్యుత్తు సరఫరాకు ప్రధాన కేంద్రంగా మారిందని వైసీపీ ప్రభుత్వంలో అధికారులు వెల్లడించారు. మండలంలో పెద్దమండ్యం, కలిచెర్ల, తుర కపల్లి సబ్‌స్టేషన్ సహా ముసలికుంటలో సబ్‌స్టేషన్ నిర్మాణంతో సబ్‌స్టేషన్ల సంఖ్య నాలుగుకు చేరింది. కలికిరి నుంచి వచ్చే మెయిన్ సప్లై లైన్ గుర్రంకొండ మీదుగా పెద్దమండ్యం మండలానికి విద్యుత్తు సరఫరా జరుగుతోంది. ములకలచెరువు మండలం బురకాయలకోట నుంచి మెయిన్ సప్లై తంబళ్లపల్లి మీదుగా గోపిదిన్నె వరకు విద్యుత్తు సరఫరా జరుగుతోంది. కలికిరి, బురకాయలకోట విద్యుత్తు సరఫరా మెయిన్ లైన్లు పెద్దమండ్యం-తంబళ్లపల్లె సరిహద్దులో రెండు విద్యుత్తు స్థంబాల దూరం మధ్య నిలిచిపోయింది. ఈ ప్రాంతంలో రెండు విద్యుత్తు మెయిన్ సప్లై లైన్లు కలిపే టెక్నికల్ పనులు పూర్తి చేస్తే మండలంలో నిరంతర విద్యుత్తు సరఫరాకు సాధ్యమౌతోందని అప్పట్లో అధికారులు వెల్లడించారు. కలికిరి నుంచి విద్యుత్తు సరఫరా అంతరాయం కలిగినప్పుడు బురకాయలకోట నుంచి, బురకాయలకోట నుంచి విద్యుత్తు అంతరాయం కలిగినప్పుడు కలికిరి నుంచి విద్యుత్తు సరఫరా జరుగుతుందని తెలిపారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామన్న వైసీపీ నేతలు, అప్పటి అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు ఈ కార్యచరణ రూపుదాల్చితే పెద్దమండ్యం కరువు మండలంలో నిరంతరం విద్యుత్తుతో ప్రజల జీవితాల్లో వెలుగులు నిండుతాయి.

## సీపీఎం జిల్లా కన్వీనర్‌గా రమణారెడ్డి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా నూతన కమిటీని పట్టణంలో మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా పోరెడ్డి రమణారెడ్డి, కో కన్వీనర్‌గా హరిని రాష్ట్ర కన్వీనర్ జి. రమణయ్య ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం వారి నుంచి పార్టీ ప్రతిజ్ఞ చేయించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీమ ప్రాంతానికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని, కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. సీపీఎం నేతలు పాల్గొన్నారు.

## పంటల బీమా చేసుకోవాలి

నిమ్మనపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు బీమా చేసుకోవాలని ఏఓ మంజుల సూచించారు. మండలం లో రైతన్న సాగు చేసిన పంటలు పకృతి వైపరిత్యాలతో నష్టపోతే ఆదుకునేందుకు పంటల బీమాను ఉపయోగపడుతుందన్నారు. ఖరీ ఫ్ కాలంలోనే కాకుండా రబీలో కూడా నష్టం జరిగితే వాటికి బీమా వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. సమాచా రం కోసం స్థానిక వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పెద్దమండ్యం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్ర మత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారులు హరివర్మ, అశోక్ చైతన్య పేర్కొన్నారు. పెద్దమండ్యం పీహెచ్‌సీలో మండల వైద్య, ఆశా సిబ్బందితో సమావేశమైన వారు మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించి ఆరోగ్య వివరాలు సేకరించాలన్నారు. గర్భిణులు, పిల్లలు, తల్లులకు అందిస్తున్న వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. చిన్నారులకు సకాలంలో టీకాలు వేయాలన్నారు. వర్షాలకు దీర్ఘకాలిక రోగులు, వృద్ధులు, పిల్లలను బయట తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌ఓ మురళిధర్, సూపరవైజర్

## డ్రంకెన్‌డ్రైవ్ కేసులో జరిమానా

నిమ్మనపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మద్యంతాగి వాహనాలు నడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచడంతో జడ్జి ఐదుగురికి కలిపి రూ.55వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు స్పెషల్ క్యాంపెయింగ్ చేపట్టినట్లు తెలిపారు. వాహనాల తనిఖీ చేపట్టి ర్యాష్ డ్రైవిగ్, లైసెన్స్‌లు, హెల్మెట్, మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు.

## బండమీద హరిజనవాడ సందర్శన

పీలేరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పీలేరు డిప్యూటీ ఎంపీడీఓ యుగంధర్, దొడ్డిపల్లె పంచాయతీ కార్యదర్శి సిగ్బతుల్లా మంగళవారం దొడ్డిపల్లె పంచాయతీ బండమీద హరిజనవాడలో పర్యటించారు. గ్రామంలో మురుగునీటి కాల్వ సమస్యపై బండమీద హరిజనవాడ గ్రామస్తులు సోమవారం ఎంపీడీఓకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో డిప్యూటీ ఎంపీడీఓ, గ్రామ కార్యదర్శి గ్రామంలో పర్యటించి మురుగునీటి సమస్యను పరిశీలించారు. వారు మాట్లాడుతూ సర్పంచ్‌తో చర్చించి వీలైనంత త్వరగా గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తామని గ్రామస్తులకు తెలిపారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కలికిరి, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సైబర్ నేరాలు పెరిపోతున్నందున ప్రజలు అప్రమత్తంగా వుండాలని కలికిరి సీఐ కె.రామ చంద్ర సూచించారు. కొత్తగజ్జలవారిపల్లెలో మంగళవారం రాత్రి ఆయన పలు అంశాల్లో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల విషయంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా వుండాలని తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి రుయాలో కిత్స పొందుతూ రవీంద్రారెడ్డి(39) మంగళవారం రాత్రి మృతి చెందాడు. తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు మదనపల్లె మండలం, సీటీఎం గ్రామం, గొల్లపల్లె వాసి రవీంద్రారెడ్డి గతంలో రెండు పెళ్లిళ్లు చేసుకుని కొద్దిరోజులకు వారితో గొడవ పడి విడిపోయారు. తర్వాత ఈశ్వరమ్మ కాలనీకి చెందిన రమణమ్మతో సహజీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం రమణమ్మతో గొడవ పెట్టుకుని వాదోపవాదాలు చేసుకున్నారు. దీంతో మనస్థాపం చెందిన రవీంద్రారెడ్డి మద్యంలో క్రిమిసంహారిణి కలిపి తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాలనీలోని రైస్‌మిల్ వద్ద అపస్మారక స్థితిలో పడి ఉండడటాన్ని గమనించిన స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్సను అందించిన తరువాత మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేద్దాం

మదనపల్లె టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామ, బూత్ స్థాయిలో టీడీపీని బలోపేతం చేయాలని మదనపల్లె మండల టీడీపీ పరిశీలకుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పోతబోలు పంచాయతీలో టీడీపీ యూనిట్, క్లస్టర్ నేతలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో మదనపల్లె మండలంలో కొన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో టీడీపీకి తక్కువ ఓట్లు వచ్చాయన్నారు. వీటిపై పార్టీ అధిష్టానం దృష్టి పెట్టి బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదికలు కోరిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సుద్దిళ్ల సుధాకర్, చల్లా శ్రీనివాసులు, మునిరాజా, కేశవ, వెంకటేశ్, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తంబళ్లపల్లె, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి అన్నారు. మంగళవారం మండల సచివాలయాల్లో రబీ సీజన్‌కు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను రైతులకు పంపిణీ చేశారు. రైతులు విత్తన కాయలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రబీలో వ్యవసాయ బోర్లు, బావులు, కాల్వల కింద వేరుశనగ సాగు చేసే రైతులు పట్టాదారు పాస్‌బుక్కు, కరెంటు బిల్లు జిరాక్సును వ్యవసాయ శాఖ సిబ్బందికి అందచేసి రిజిస్ట్రేషన్ చేసుకుని కాయలు పొందాలని తెలిపారు. వీఏఏలు సురేష్, సుధాకర్, రెడ్డిశేఖర్, నవ్యశ్రీ, కూటమి నేతలు పురుషోత్తం, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, సుధాకర్‌రెడ్డి, నరసింహులు, మదన, సుధాకర, సోము, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## వేరుశనగ విత్తనకాయల పంపిణీ

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో రబీ సీజన్‌కు 300 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయలు వచ్చినట్లు ఏఓ ప్రేమలత అన్నారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయ బోర్లు, ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు ప్రభుత్వ సబ్సిడీతో వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేస్తున్నామన్నారు. రైతుల సూచన మేరకు కే-6రకం, విశిష్ట రకం 300క్వింటాళ్లు వచ్చాయన్నారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసుబుక్కు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ మేరకు 30 కిలోల బస్తా రూ. 1667గా నిర్ణయించామన్నారు.

## గంగమ్మకు ప్రత్యేక పూజలు



మదనపల్లె అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కోర్టు ఆవరణలో వెలసిన గంగమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి ధూపదీపనైవేద్యాలు సమర్పించారు. ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు పెరవళి వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యక్షుడు కరుణాకర్, కార్యదర్శి ప్రభాకర్ నాయుడు, ట్రెజరర్ మహేశ్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

## రేపు దత్తజయంతి మహోత్సవం

కలకడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బాలయ్యగారిపల్లి పంచాయతీ నల్లగుట్టపల్లి మర్రిచెట్టు వద్ద వున్న ఆలయంలో గురువారం దత్తజయంతి మహోత్సవం జరపనున్నట్లు ధర్మకర్త రేవూరి రామయ్య, గ్రామస్థులు తెలిపారు. ఉదయం మహాగణపతి, రామలింగేశ్వరస్వామి, దత్తాత్రేయ, అనఘాదేవి అమ్మవారికి పంచామృతాభిషేకం, గోపూజ, కలశస్థాపన, నవగ్రహ ఆరాధన తదితర పూజ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం నుంచి అన్నదానం, రాత్రి ప్రాకారోత్సవం, ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి, అమ్మవారి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## ఏజీపీగా భవానీ శంకర్

కలికిరి, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): పీలేరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాది (ఏజీపీ)గా భవానీ శంకర్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ప్రస్తుతం పీలేరు కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. మూడేళ్ల కాల పరిమితితో ఆయన్ను నియమిస్తూ రాష్ట్ర న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శి జి.ప్రతిభా దేవి ఆదేశాలు జారీ చేశారు.

## పేకాట రాయుళ్ల అరెస్టు

నిమ్మనపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రెడ్డివారిపల్లి పంచాయతీ పిట్టావాండ్లపల్లిలో పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో తన సిబ్బందితో కలసి దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి మూడు మొబైల్ ఫోన్‌లు, రూ.3750ల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు,

## బాధ్యతలు చేపట్టిన సీఐ రామచంద్ర



కలికిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కలికిరి అప్ గ్రేడ్ పోలీసు స్టేషన్ సీఐగా కె.రామ చంద్ర మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన అనిల్‌కుమార్ కడపకు బదిలీ కాగా ఆయన స్థానంలో రాయచోటి ఎస్టీఎఫ్‌లో వున్న రామచంద్రను నియమించారు. బాధ్యతలు తీసుకున్న ఆయనను పోలీసు ఏఎస్ఐలు, హెచ్‌సీలు, స్టేషను సిబ్బంది అభినందించారు.

## 'టీడీపీని బలోపేతం చేస్తా'

గుర్రంకొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పార్టీని గ్రామ, బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయడానికి నిరంతరం శ్రమిస్తానని వాల్మీకీపురం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నౌషాద్‌అలీ అన్నారు. మంగళవారం తరిగొండలో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధిష్టానం తనపై నమ్మకంతో పుంగనూరు నియోజకవర్గం సోమల మండలం బూత్ ఇన్‌చార్జిగా ప్రకటించిందన్నారు.

## హైస్కూల్‌లో లైబ్రరీ ప్రారంభం

పెద్దమండ్యం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) కలిచెర్ల హైస్కూల్‌లో విద్యార్థుల కోసం మంగళవారం హెచ్‌ఎం మీనా నాగలక్ష్మి లైబ్రరీ ప్రారంభించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఉపాధ్యాయులు రామకృష్ణ, కృష్ణవేణి, రాధ, సహకారంతో పాఠశాలలో లైబ్రరీ అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ప్రతి తరగతి పాఠ్య పుస్తకాలు అందుబాటులో వుంటాయన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

పెద్దమండ్యం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని పెద్దమండ్యం ఎస్ఐ వెంకటేశ్వర్లు పిలుపు నిచ్చారు. కలిచెర్ల శ్రీ చైతన్య హైస్కూల్ నిర్వాహకులు వెంకటరమణ ఆధ్వర్యంలో మంగళవారం రెండు బారికేడ్‌లు తయారు చేయించి స్థానిక పోలీసు స్టేషన్‌కు వితరణగా అందించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనాల వేగం నివారణకు బారికేడ్‌లు ఉపయోగపడతాయన్నారు. ఏఎస్ఐ ఇసాక్, పోలీసులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించాలి

కలకడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించి ప్రజలకు సకాలంలో సేవలందించాలని డిప్యూటీ ఎంపీడీఓ చక్రపాణి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం నడిమిచెర్ల, కోన, గుడిబండ సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ వివిధ సర్వేలను నిర్దేశించిన సమయంలోగా వందశాతం పూర్తి చేయాలని సూచించారు.

